స్థాపితము 1925 రజిష్టర్ నెం ఎ. 92

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి. ఎం.ఏ

నంపుటి: 14 సంచిక: 177 :: హైదరాబాద్, గురువారము 6 - 7 - 1961 :: 4 పేజీలు 7 నయాపైసలు

101455

ఎర్రబల్లిలో గాజుఫ్యాక్టరీ స్థాపనకు తలంపు

హైదరాబాద్, జులై 5.

పెద్దపూర వంచాయత్ సమితికి చెందిన ఎర్రబల్లి గ్రామములో 2.98 లక్షల ఖర్చుతో ఒకగాజుఫ్యాక్టరీని స్థాపించడానికి రాష్ట్రవాణిజ్య పరిశ్రమలశాఖ తలపెడుతున్నది. గాజు, సిరమిక్ పరిశ్రమల్లో వాడ బడు శ్వార్టజ్ యీఎర్రబల్లి ప్రాంతంలో ఇబ్బడిగా దొరుకుతుంది. ఎర్ర బల్లి గాజుఫ్యాక్టరీలో సీసాలు, చిమ్నీలు తయారుచేయడానికి ఏటా 60 టన్నుల గాజు ఉత్పత్తి కాగలదనీ దీనివల్ల 16 వేలు లాభము రాగలదనీ కూడా అంచనా వేయబడింది.

అల్జీరియా విభజనవ్యతిరేకదిన సంఘర్షణలు

57 మంది మృతి, 200 మందికిపైగా గాయాలు

అల్జీర్స్, జులై 5

అల్జీరియా అంతటా విప్లవవాదులు నేడు విభజన వ్యతిరేక దినోత్సవం సందర్భముగా నిర్వహించిన సమ్మెలు, ప్రదర్శనల ఫలితంగా జరిగిన సంఘర్షణలలో కనీసం 57 మంది చనిపోయినారనీ, 200 మందికిపైగా గాయపడినారనీ ఫ్రెంచిప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు యీరాత్రి ప్రకటించాడు.

శిఖరపాతాలు, సముద్రతీరంకోత, కేరళ అంతటా జలప్రళయం

భారతదేశంలో మోటారుకార్లఉత్పత్తి

రు. 65 కోట్ల హెచ్చింపు పథకాలకు కేంద్ర ఆమోదం

న్యూఢిల్లీ, జులై 5

ప్రయాణీకుల కార్లను, జీపులను, ట్రక్కులను ఎక్కువగా ఉత్పత్తి చేసేందుకై భారత ప్రభుత్వం కొన్ని మోటార్ సంస్థల విస్తరణ పథకాల ఆమోదించినది. ఈ సంస్థలు చెల్సొక్ స్టాండర్డు మోటార్సు, ఆలోక్ లేలాండు, మహేంద్రఅండ్ మహేంద్ర. తమ ఉత్పత్తిని రెట్టింపు చేయడానికి ప్రీమియర్ ఆటోమొబైల్స్ హిందుస్థాన్ మోటార్స్ పెట్టుకున్న అప్లికేషన్లు ఇంకా భారత ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ఈ మోటార్ ఉత్పత్తి సంస్థల విస్తరణ పథకాల అన్నింటికి రు. 65 కోట్ల ఖర్చు కాగలదు.

ఉస్మానియా ఖర్చుల్లో పొదుపును సూచించు కమిటీ

నియమించ బడాలని

విద్యార్థి ప్రతినిధుల సూచన

హైదరాబాదు, జులై 5

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆదాయాన్ని పెంచేందుకు నూతన మార్గాలను ప్రస్తుత ఖర్చులలో పొదుపును సూచించుటకు ఒక సర్వస్వతంత్ర సంఘాన్ని నియమించాలని, ఆ సంఘ నివేదిక అందేవరకు ఫీజు హెచ్చింపును అమలువరచ గూడదని ఉస్మానియా విద్యార్థుల ఉన్నతాధికార సంఘం నేడు విలేఖరుల గోష్ఠిలో సూచించింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఫీజును హెచ్చించినందుకు గత కొన్ని రోజులనుండి విద్యార్థులు ఆందోళన పడుచున్నారు. సంఘ వ్యక్తి నిధులు యింతవరకు వైస్ ఛాన్సలర్‌ను ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని కొందరు సిండికేట్ సభ్యులను కలిసి తమ అభిప్రాయాలను తెలిపారట.

ఫీజు హెచ్చింపును విరమించాలని విద్యార్థిసంఘ ప్రతినిధులు శ్రీ డి. ఎస్ రెడ్డిని కోరగా విశ్వ విద్యాలయానికి తగునిధులు లేనందున ఫీజులను హెచ్చించి నిధులను పెంచుకొమ్మని ప్రభుత్వం విశ్వవిద్యాలయానికి చెప్పిందని, అందువల్లే ఫీజులను హెచ్చించుట జరిగిందని చెప్పారట. ఈ విషయాన్ని ఆర్థికమంత్రితో నివేదించగా "నాకేమీ తెలియదు. విశ్వ విద్యాలయం సర్వస్వతంత్ర సంస్థ; వారుతగ్గిస్తుంటే మేము వద్దంటామా" అన్నారట. ఇట్టి పరిస్థితులలో తామెవరితో మొరపెట్టుకోవాలో తెలియని స్థితి ఏర్పడిందని ఉన్నతాధికార సంఘ ప్రతినిధి ఒకరు చెప్పారు.

ఫీజు హెచ్చింపును కొన్ని మాసాల క్రితమే నిండికేటు ఆమోదించింది. అయితే యీఆమోదానికి కారణము విశ్వవిద్యాలయ 4వ తరగతి ఉద్యోగులు సమ్మెనోటీసు యివ్వడమేనని ఒక సిండికేటు సభ్యుడు విద్యార్థి ప్రతినిధులకు చెప్పారట.

ఫీజు హెచ్చింపు విద్యార్థులసమస్యే కాదు. ప్రతిపౌరుని సమస్య. దీనివల్ల అందరిపై భారమే పడుతుంది. కనుక అందరూ ఫీజుతగ్గింపు ఉద్యమంలో తమతో సహకరించాలని వారు కోరారు.

రేపు విద్యార్థులు సమ్మె చేయనున్నట్లు యున్న వదంతులను ఉన్నతాధికార సంఘాధ్యక్షులు ఖండించారు. ముఖ్యమంత్రి, విద్యామంత్రి నగరములో లేనందున వారితో కలియు అవకాశం ఇంతవరకు లభించలేదని వారు వచ్చినట్లు వారినికూడ కలిసి చర్చించిన తర్వాత ముందేమి చేయాలో జూలై 10న నిర్ణయి అయనచెప్పాడు (మా. వి)

జపాన్‌లో భారీ వర్షాలు

మృతుల సంఖ్య 259 కి పెరిగిన వైనం

టోకియో, జూలై 5

గత రెండురోజులలో కురిసిన కుండపోత వర్షాలవల్ల మధ్య, ఉత్తర జపాన్ తీర ప్రాంతంలో 11 గురు చనిపోయారని, 11గురు అగుపించుటలేదని, మరో 12 గురు గాయపడ్డారని పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. చనిపోవుట చాలవరకు భూమి కృంగుట వల్లనే సంభవించిందట. నదీ తీరాలను బందోబస్తు చేయు యత్నంలో నదులలో పడిపోయిన వారిని, తప్పిపోయిన వారి పట్టీలో చేర్పుట జరిగింది.

జాతీయ రైళ్ళ రాకపోకలను 26 చోట్ల రద్దు పరిచారు. గత వారం పశ్చిమ, మధ్య జపాన్‌లో 6 రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షఫలితంగా 248మందిచనిపోయారు. మరో 81గురు ఇంకా అగుపించలేదు. ఈ వారం తిరిగి గొప్ప వర్షాలు కురిసి పై పేర్కొనబడిన 11 గురు చనిపోయారు.

సింగరేణి కాలరీలలో కేంద్రం వాటాల హెచ్చింపు

రాష్ట్రానికే ఋణంయివ్వడం మంచిదని శ్రీ సంజీవరెడ్డి సూచన

హైదరాబాద్, జులై 5

సింగరేణి కాలరీలలో కేంద్రప్రభుత్వము తనవాటాల్ని అధికంచేసుకొని గనులనిర్వహణను చేపట్టదలిచిందన్న వార్తపై నేడు కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ నీలం సంజీవరెడ్డి వ్యాఖ్యానిస్తూ కేంద్రం తనవాటాల్ని ఎక్కువ చేసుకొనేకన్న-ఆపరిశ్రమ ఎలాగూ ప్రయివేటు పరిశ్రమకాదు కాబట్టి- రాష్ట్రప్రభుత్వానికే ఋణంరూపేణా ధనసంపత్తి కల్పించవచ్చుగదా అన్నారు. కేంద్రంవాటాలు ఎక్కువయితే ఆపరిశ్రమమీద రాష్ట్రప్రభుత్వపు పట్టు ఇక ఉండదు.

వరంగల్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ

వచ్చే ఎన్నికలలో 9 అసెంబ్లీ స్థానాలనుండి పోటీ

వరంగల్, జులై 5

వరంగల్ జిల్లానుండిగల 18అసెంబ్లీ స్థానాలలో తొమ్మిదింటికి పోటీ చేయుటకు వరంగల్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయించినది. మిగతా నియోజక వర్గాల నుండి పోటీ చేసే ఇండిపెండెంట్లలో అభ్యుదయ భావాలు కలవారిని కమ్యూనిస్టు పార్టీ బలపరచగలదు. పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టులకు వెంటనే కేంద్రం మంజూరీ ఇవ్వాలని జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఒక తీర్మానంద్వారా కోరినది.

భువనగిరి ప్రకటనపై శ్రీసంజీవరెడ్డి వివరణ

నదీజలాల వివాద పరిష్కారానికి పోచంపాడు, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణం ఆటంకం కాదని ఉద్ఘాటన

హైదరాబాద్, జూలై 5

కృష్ణా, గోదావరీ నదీజలాల పంపకంలో వాటికి సంబంధించి రాష్ట్రాలమధ్య 1951 ఒడంబడికపై ఉత్పన్నమైన వివాదాన్ని ఒక సుప్రీంకోర్టున్యాయమూర్తి గాని, ప్రధాని నెహ్రూగాని, కేంద్ర జలవిద్యుత్కమిషన్‌గాని పరిశీలించాలని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి నేడిచట అన్నారు. పోచంపాడు, శ్రీశైల ప్రాజెక్టుల నిర్మాణంవల్ల 1951 ఒడంబడికపై తలెత్తిన వివాదపు పరిష్కారానికి యేమాత్రమూ ఆటంకం కలుగదని పేర్కొన్నారు.

ఈమధ్య జరిగిన ఆంధ్రప్రదేశ్ రాజకీయ మహాసభలో గోదావరిపై పోచంపాడు, కృష్ణపై శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణావశ్యకతను గూర్చి తాను చెప్పగా మహారాష్ట్ర, మైసూర్ నాయకులు అపార్థం చేసుకున్నారని, వాటిఅవశ్యకతనుగూర్చి రాజకీయమహాసభలో మాట్లాడినపుడు 1951 ఒడంబడికపైనున్న వివాదాన్ని దృష్టినుంచుకోలేదని, ఆ వివాదం యెంతవరకు సమంజసమో లేక అసమంజసమో అనువిషయాన్ని తాను యేమాత్రం వెల్లడించలేదని శ్రీరెడ్డి స్పష్టపరచదలచానని శ్రీ రెడ్డి విలేఖరులతో అన్నారు.

"రామన్న ఒకటి రెండు సంవత్సరాల్లో విద్యుచ్ఛక్తి సరఫరా విషయంలో ఆంధ్రప్రదేశ్ యెదుర్కొనవలసిన ఇబ్బందులు నాకుతెలుసు. అందుకే శ్రీశైలం ప్రాజెక్టును తక్షణము నిర్మించాల్సిన అవసరముంది. దాని నిర్మాణంవల్ల నీరు వృథాగా పోదు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం చాలా ముఖ్యం" అని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

పోచంపాడు ప్రాజెక్టును ప్రస్తావించి దాని విషయంలో వివాద కారణమేమీ లేదని, నిర్మాణ పథకం ఆంధ్రప్రదేశ్ అవతరణకు పూర్వమే నిజాంప్రభుత్వ హయాంలోనే సిద్ధం చేయబడిందని, అది గోదావరి ఉత్తర కాలువ పథకంలో ఒక భాగమని శ్రీ రెడ్డి తెలిపారు.

రెండు ప్రాజెక్టుల నిర్మాణావశ్యకతను గూర్చి మాట్లాడునపుడు తానే రాష్ట్రాన్ని బలపరచుటలేదని, అట్టి ముఖ్య ప్రాజెక్టుల విషయములో యే రాష్ట్రమైనా తన అభిప్రాయాలు ఒకటేనని, మహారాష్ట్ర, మైసూర్, ఆంధ్ర రాష్ట్రాలు వివాదాన్ని సులభముగా పరిష్కరించుకోవాలని, వివాద విషయంలో ప్రధాని లేక కేంద్ర జల, విద్యుచ్ఛక్తి కమిషన్ లేకసుప్రీంకోర్టు న్యాయమూర్తి సహాయము పొందవచ్చని శ్రీసంజీవరెడ్డి సూచించారు.

భారత కమ్యూనిస్టు పార్టీ ఒక పరాయి దేశపురాజకీయ పక్షపు భాగమేనని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ సంజీవరెడ్డిపేర్కొంటూమాస్కో ఆదేశాల ప్రకారమే అది సర్వదానడుస్తుంటుందనీ యీవిషయాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ యీవాటివరకూ కాదనలేకపోతున్నదనీ అన్నారు.

రామన్న ఎన్నికల్ని గురించి ప్రస్తావించి ఆయన స్వతంత్రపార్టీని గురించి అసలు ఆలోచించాల్సిన అవసరమే లేదని ఒప్పిస్తా ఎన్నికలవల్ల తేలిందని అన్నారు. మధ్యాసు రాష్ట్రంలోనే స్వతంత్ర పార్టీ పెద్దగా సీట్లు సంపాదించుకోలేక పోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.

పాలఘాటు లోయల్లో కొండలు కూలి 73 మంది మరణం

అమ్మోనియం బస్తా రు. 70 కి అమ్మకం

(మా.వి) నిజామాబాద్, జులై 5

నిజామాబాద్ జిల్లాలో ఎరువులు దొరుకుటలేదని రైతులు మిక్కిలిఇబ్బందులు పడుచున్నారని తెలిసింది. నిజామాబాద్ పట్టణములో ఒక్క అమ్మోనియం సల్ఫేటు బస్తా 70 రూపాయల ప్రకారం బ్లాక్ మార్కెటులో అమ్ముచున్నారు. ప్రభుత్వము అతి తొందరగా చర్యగైకొని రైతులకు ఎరువులు ప్రభుత్వ ధరకు లభించునట్లు చూడకున్నచో రైతులు ఇంకా అధిక కష్టాలకు గురిఅయ్యే ప్రమాదముంది.

బిక్కనూరు గోదాంనుండి

బిక్కనూరు వ్యవసాయశాఖ గోదాంనుండి కొండాపురం వ్యవసాయ దారుల పేర్లతో దొంగసంతకాల ద్వారా తెలివరీ రిజిష్టరులో వ్రాయబడి సాయంత్రం వాలుగు బండ్లపైన దొంగతోవలలో చేరవేయబడుచున్న 18 అమ్మోనియం సంచులను మండల యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుకున్నారు. ఈ విషయము ప్రభుత్వాధికారులకు తెలుపగా వారు ఆ సంచులను స్వాధీనపరచుకున్నారు. వ్యవసాయశాఖ అధికారులు యింతవరకు ఏలాటి చర్య తీసుకొనలేదని కూడా మండల యువజన కాంగ్రెసు కమిటీ వారు వాస్తున్నారు.

ప్రమాద స్థలాలకు చేరేవీలులేకుండా రోడ్లకు గండ్లు, అంచనాలకు అందని నష్టం

త్రివేంద్రం, జూలై 5

కేరళలో యీయేడాది జలప్రళయమే సంభవించిందనీ దాదాపు రాష్ట్రంలోని యావత్తు పల్లపు భూములూ నీటమునిగిపోయాయనీ కొండలు కూలడమేకాక సముద్రతీరపు భూమి అంతా కోతకు గురవుతున్నదనీ నేడు విలేఖరులకు కేరళ ముఖ్యమంత్రి శ్రీ పట్టంతానుపిళ్లై తెలియజేశారు.

పాలఘాట్ జిల్లాలోని అత్తపడిలోయలో కొండలుకూలి రెండు గ్రామాల్లో 78 మంది చనిపోయినట్లు హోంమంత్రి పి.టి. చాకోవెల్లడించారు.

కేరళ అంతటా కుంభవృష్టులు, వరదలవల్ల రాకపోకల సౌకర్యాలన్నీ భగ్నమయిపోయినందున ఎక్కడెక్కడ ఏయే ఘోర ప్రమాదాలు జరిగినదీ వివరాలు వెంటనే అందడంలేదనీ నష్టం అంచనా కూడా కష్టమవుతున్నదనీ ముఖ్యమంత్రి శ్రీ పానుపిళ్లై పేర్కొన్నారు.

కొండలుకూలి చనిపోయిన వారు ఎక్కువగా ఆదివాసులట. పాలఘాటు పోలీసు సూపరింటెండెంటు కొంతమంది పోలీసుల జట్టుతో ప్రమాద స్థలాలకు బయలు దేరారు, కాని రోడ్డులో పదిమైళ్ళ మేరలో 8 చోట్ల గండ్లుపడినందున ఆ స్థలాలు చేరేందుకు 12మైళ్లు నడవాల్సి ఉన్నదట కూడా.

వరదప్రాంతాలు, ప్రమాదాలు జరిగిన ప్రాంతాలమీద రేపు ముఖ్యమంత్రి, ఇతరమంత్రులు, ఉన్నతాధికారులు విమానంలో పర్యటించి పరిశీలించనున్నారు. ఇటీవలనే రబ్బర్ బోర్డు అధ్యక్ష పదవినుండి విరమించిన శ్రీ కె.టి. వారియర్ వరద ప్రమాదాల నష్టం అంచనాను తయారుచేసి సహాయతా కార్యక్రమాల్ని సూచించడానికి స్పెషలాఫీసర్‌గా నియమింపబడ్డారు.

జిల్లాకలెక్టర్లు వీలున్నంతవరకూ సహాయతాకృషికై సాయిధదళాల్ని వాడుకోవచ్చుననీ మంజూరీకోసం ఆగకుండా సహాయం కల్పించవచ్చుననీ ప్రభుత్వం ఉత్తర్వులు చేసినట్లు హోంమంత్రి తెలిపారు. సహాయానికై కేంద్రాన్ని కోరుతామనీ ప్రజల విరాళాల్నికూడా అభ్యర్థిస్తున్నామనీ ముఖ్యమంత్రి నేడన్నారు.

జాతీయ రహదారిలో ఆల్వాయి, అంగమలైల మధ్య రోడ్డు 20 అడుగులు క్రుంగిపోయిందని తెలిసింది. ఎర్నాకులం సమీపాన ఒకగ్రామంలో చెట్టుకూలి భార్య, భర్త, శిశువు ముగ్గురూ నిద్రలోనే మరణించారు. సహాయానికై ప్రధానికి విజ్ఞప్తి

కేరళ వరదబాధితులకు ప్రధాని సహాయతానిధినుండి భూరిసాయము అందజేయాల్సిందిగా ప్రధాని శ్రీ నెహ్రూకు నల్గురు కమ్యూనిస్టు కేరళ ఎం.పి.లు తంతిద్వారా విజ్ఞప్తిచేశారు. కేరళ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా నేడు ఎన్నికైన శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ (శాసనసభా ప్రతిపక్ష నాయకుడు) కూడా ఇలాంటివిజ్ఞప్తినే నెహ్రూకు పంపారు.

ఎన్.సి.సి. రాష్ట్రపోలీసు దళాలు సహాయతా కృషిలో అధికారులకు తోడ్పడుతున్నాయి.

సోలియార్ హైడల్ ప్రాజెక్టు నిర్మాణం సాగుతున్న స్థలానికి ఇటు, అటు ఉన్న రోడ్లు గండ్లుపడినందున నిర్మాణం నిలిపివేయబడింది.

మద్రాసు రాష్ట్రంనుండి, మైసూరు రాష్ట్రం నుండి ఆందోళనకరమైన వార్తలేమీ చేరకున్నప్పటికీ వరదల పరిస్థితి ఉద్ధృతంగానే ఉన్నట్లు తెలియవచ్చింది.

విరాళాలకు ప్రధాని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 5: ప్రధాని జాతీయ సహాయతానిధి దాదాపు పూర్తిగా ఖర్చయిపోయిందనీ వర్షాకాలం దాపురించినందున అనేక ప్రాంతాలనుండి సహాయానికి అభ్యర్థనలు రాగలవనీ యిప్పటికే కేరళ ప్రజలకు సహాయానికై విజ్ఞప్తులుచేస్తున్నాయనీ కాగా యీనిధికి ఉదారంగా విరాళాలు పంపాల్సిందనీ నేడు ప్రధాని శ్రీ నెహ్రూ ఒకవిజ్ఞప్తి ప్రకటన చేశారు.

జాయింటు స్టాఫ్ కౌన్సిల్

ఈనెల 8 వ తేదీన ముఖ్యమంత్రిచే ప్రారంభోత్సవం

హైదరాబాద్, జులై 5

ఈనెల 8 వ తేదీన ఉదయం 10 న్నర గంటలకు కమిటీరూమ్‌లో స్టేట్ జాయింటు స్టాఫ్ కౌన్సిల్‌కు ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రారంభోత్సవం చేస్తారు.

ఈ కౌన్సిల్‌లో 16 గురికి తక్కువ కాకుండా 24 మందికి మించకుండా సభ్యులుంటారు. వీరిలో సగంమందిని ప్రభుత్వం (అధికార్లనుండి) నియమించగా, మిగతాసగాన్ని గుర్తించబడిన ప్రభుత్వోద్యోగుల సంఘాలు పంపుతవి.

ఉద్యోగుల అనుభవాన్ని భావాలను ఉపయోగములోనికి తేనడానికి ఉద్యోగులు వారిబాధ్యతలను సక్రమముగా నిర్వహించడంలో తోడ్పడటానికి, రిక్రూటుమెంటు, పనిగంటలు క్రమశిక్షణ, పరిపాలనకు సంబంధించి నంతవరకు వివిధ అంశాలలో ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి జాయింటు కౌన్సిల్ తోడ్పడగలదు.

జాయింటు కౌన్సిల్ నిర్మాణంతో పరిపాలన మరియు ఉద్యోగుల మధ్య సంబంధాలు బాగుపడి ప్రభుత్వంలో సమర్థత హెచ్చింపునకు దోహదకారి కాగలదని విశ్వసింపబడుచున్నది.

నీలోఫర్ ఆసుపత్రిలో ఉచితంగా పోలియో టీకాలు

హైదరాబాద్, జులై 5

హైదరాబాదులోని నీలోఫర్ ఆసుపత్రిలో జూలై 6, 7, 8 వ తేదీలలో రోజూ ఉదయము 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు పిల్లలకు పోలియో టీకాలు వేయబడగలవు. కార్డులున్న పిల్లలకూ, లేని పిల్లలకు అందరికీ టీకాలు వేస్తారు.

త్రిచూర్ జిల్లాలో పదివేల మందికి నిరాశ్రయత

త్రిచూర్, జులై 5

త్రిచూర్ జిల్లాలోని కోస్తామరియు పల్లపు ప్రాంతాలలో అధికవర్షాలవల్ల పదివేలమందికి పైగా తమ ఆవాసాలకోల్పోయారు. వీరి ఇండ్లు నీటమునిగి మో ఇతర ఆస్తులు వరదనీటిలో కొట్టుకొని పోవడమో జరిగినది.

పౌర్ మంగోలియాకు సమితి సభ్యత్వం

ప్రతిపాదనపై ఫార్మోజా వీటో చేయగలదట

తైపే, జులై 5

క్యుమింగ్ టాంగ్ చైనా ప్రధాని చెన్ చెంగ్ నేడొక సమావేశములో మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సభ్యత్వము ఔటర్ మంగోలియాకు లభించేట్లయితే ఫార్మోజా తాను సమితి నుండి వైదొలుగుతుందనిప్రకటించాడు అవసరమయితే తాము వీటోను ప్రయోగిస్తామని కూడా అన్నాడు. (ప్రధాన తీర్మానాలు అమలు కావడానికి భద్రతాసంఘంలోని 5 శాశ్వత దేశాల ఏకగ్రీవాభిప్రాయం అవసరము. భద్రతా సంఘంలోని ఆ ఐదు రాజ్యాలలో ఫార్మోజాఒకటి.)

కువైత్, ఇరాక్ సరిహద్దులో సైనిక సమీకరణ

కువైత్, జులై 5

కువైత్ సంరక్షణార్థంఈడెన్ సైప్రస్ కెన్యా బ్రిటన్‌ల నుండి మరికొన్ని సైన్యాలు వచ్చాయి. కువైత్ ఇరాక్ సరిహద్దులో కేంద్రీకరింపబడిన ఈ పటాలాల బ్రిగేడియర్ డెరెక్ హార్స్‌ఫోర్డు పాలికాపర్ పైవెళ్ళి తనఖచేశాడు. ఈ రెంటికి 80 మైళ్ళ పొడవు సరిహద్దు కలదు. సరిహద్దులలో గస్తీదళాలు పూర్తిగా సాయుధం చేయబడినవి. రెండవ పారాచూట్ దళం సైప్రస్ నుండి కువైత్‌కు చేరుడం పూర్తి అయింది.

సౌదీ అరేబియా పటాలం ఒకటి బ్రిటిష్ కువైత్ సమష్టి కమాండులో పనిచేస్తున్నది. బగ్దాదులో ఇరాక్ నాయకులతో సంప్రదింపులు జరిపి అరబ్‌లీగ్ కార్యదర్శి అబ్దుల్ ఖలీఖ్ హసోనా లేఖద్వారాయగా వేలకొద్దీ కువైత్ ప్రజలు స్వాగతం చెప్పారు. కువైత్‌లో ఇతను రెండురోజులుండి ఇచ్చటి పరిపాలకునితో సంప్రదించిన తర్వాత సౌదీఅరేబియా రాజధాని రియాద్‌కు వెళ్ళగలడు.

ఎనమదుర్రు కాల్వలో పి.డబ్ల్యు.డి. బోటు మునుక

హైదరాబాద్, జులై 5

పశ్చిమ గోదావరిజిల్లా గొల్లవాని తిప్పవద్ద ఎనమదుర్రు కాలువలో ఒక పి.డబ్ల్యు.డి. బోటు సోమవారంనాడు మునిగిపోయిందనీ, ఆ బోటులో 85 మంది కార్మికులు ఉన్నారనీ నేడు ఇచటికి అధికారవార్త అందింది. 12 మందిని గ్రామస్థులు కాపాడారట. కొందరు తామేఈదుకొనిఒడ్డుచేరారు. ఒక్కశవం దొరికింది అనలెందరు చనిపోయిందీ ఇంకా తెలియరాలేదు.

బొల్లారంలో నాటుబాంబు

ప్రేలి ఇద్దరుపిల్లల మృతి

జహీరాబాదులో తుపాకిప్రేలి 5 గురికి గాయాలు, ఒకని మరణం

హైదరాబాదు, జూలై 5

బొల్లారంలో యీఉదయం ఒక నాటుబాంబు ప్రేలి ఇద్దరు పిల్లలు నిపోయారు.

ఉదయం పొలాల్లోకి ఆడుకోడానికి వెళ్లిన యిద్దరు పిల్లలకు ఒక నాటు బాంబు కనిపించిందనీ అదేమిటో తెలియక వారు దాన్ని పరిశీలిస్తుండగా అది ప్రేలి ఒకడు వెంటనే చనిపోయాడనీ మరొకపిల్లవాడు ఆసుపత్రికి కొంపోతుండగా చనిపోయాడనీ తెలుస్తున్నది.

ఉస్మానియాఆసుపత్రిలో

జహీరాబాదు బాలుని మృతి

నిన్న జహీరాబాద్‌లో ఒక గుర్రాతుపాకిలోని తూటాలు ప్రేలి ఆర్గురు పిల్లలు గాయపడ్డారనీ వారిలో తీవ్రంగా గాయాలు తగిలిన అబ్దుల్ సత్తార్ శరణప్ప అను పిల్లల్ని ఉస్మానియా ఆసుపత్రికి తెచ్చి చేర్చగా వారిలో సత్తార్ నేడు మరణించాడని తెలుస్తున్నది. శరణప్పకు ఒక చెయ్యి తీసివేశారు.

నిన్న జహీరాబాద్‌లో ఒక పెండ్లి ఊరేగింపు సాగుతుండగా వర్తకులు దుకాణాల కాపలాకు నియమించిన ఒక గూర్ఖా తన తుపాకిని గాలిలోకి ప్రేల్చాడు. ఒక సారితర్వాత ఆతుపాకి ప్రేలలేదట. దానిలోని తూటాలను ఆతడు తొలగిస్తుండగా అవి ప్రేలి చుట్టుముట్టిన పిల్లల్లో ఆర్గురు గాయపడ్డారట. పోలీసులు గుర్ఖాను అరెస్టుచేశారు.

ప్రొ॥ ఎ ఆర్. వాడియాకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సభ్యత్వం

న్యూఢిల్లీ, జులై 5

ఇటీవల మరణించిన డా॥ కె.ఎస్. కృష్ణన్ స్థానే యూనివర్సిటీగ్రాంట్స్ కమిషన్ సభ్యులుగా సోషల్ సైన్సెస్ తాతాఇన్‌స్టిట్యూటు డైరెక్టర్ ప్రొ॥ ఎ ఆర్. వాడియాను కేంద్రం నియమించింది.

మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ మహేందర్‌జీ మృతి

హైదరాబాద్ జూలై 5

హైదరాబాదు మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ మహేందర్‌జీ కొద్దికాలము అనారోగ్యంతో బాధపడి నేటి ఉదయము దివంగతులయ్యారు.

శ్రీమహేందర్‌జీ 2 టరంలనుండి మున్సిపల్ కార్పొరేషన్‌లో సభ్యులుగా ఉంటున్నారు. ప్రస్తుతమున్న కార్పొరేషన్‌కు 2 సంవత్సరాలక్రితం తిరిగి ఎన్నుకోబడ్డారు. యాదవ వర్గానికి చెందిన ప్రధాన నాయకుడే కాక శ్రీమహేందర్‌జీ రామ్‌కోట్ మండల్ కాంగ్రెస్ అధ్యక్షులు కూడా. హైదరాబాద్ పారిశ్రామిక ప్రదర్శనంతో కూడా ఆయనకు సంబంధముండింది. వీరు ఇన్‌కంటాక్స్ అప్పిలేట్ ట్రిబునల్ సభ్యులు శ్రీ శంకర్జీ సోదరులు శ్రీ మహేందర్‌జీ అంత్యక్రియలు ఈ సాయంత్రం జహాన్నుమా శ్మశాన స్థలిలో జరిగాయి. మేయర్ శ్రీ దుసాజ్. కమిషనర్ శ్రీ లోకనాథం తదితర ప్రముఖులు హాజరయ్యారు. శ్రీ మహేందర్‌జీ మృతిపట్ల సంతాపము వెల్లడిస్తూ మేయర్ ఒక ప్రకటన చేశారు. నేడు కార్పొరేషన్ కార్యాలయాలన్నీ కూడా మూసివేయబడినాయి.

శ్రీ సి. శ్రీరాములు అధ్యక్షతన వినోబా రాత్రిపాఠశాల కమిటీ సమావేశం జరిగి శ్రీ మహేందర్‌జీమృతికి సంతాపం వెల్లడించబడింది.

రాజస్థాన్ గ్రామాలలో కాటక పరిస్థితులు

జైపూర్, జూలై 5

అజ్మీర్, జోధ్‌పూర్, ఉదైపూర్ డివిజనులలో దాదాపు ఐదువందల ఏబది గ్రామాలను కాటక ప్రాంతాలుగా రాజస్థాన్ ప్రభుత్వం ప్రకటించినది.

సిటీ రూట్లలోనే ఆర్.టి.సి.కి నష్టం

అయినా సమ్మర్దపు వేళల్లో అదనపు బస్సులు నడపడానికి నిర్ణయం

హైదరాబాద్, జులై 5

ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్పోర్టు కార్పొరేషన్ నిర్వహణలో ఉన్న 289 రూట్లలోను 204 రూట్లుమాత్రమే లాభసాటిగా ఉన్నాయనీ చాలా సంవత్సరాలనుండి సిటీరూట్లలో నష్టమే వస్తున్నదనీ నేడు ఒక ఆర్.టి.సి. ప్రకటనలో తెలుపబడింది.

సిటీ రూట్లలో పాఠశాలలు, ఆఫీసుల సమయాలలో కొన్ని ప్రధానమయిన రూట్లమీద జనసమ్మర్దం ఎక్కువై బస్సులుచాలక పోతున్నప్పటికీ మిగిలిన సమయాలలో బస్సులు ఖాళీగానే నడుపడం సంభవిస్తున్నందున సిటీరూట్లు నష్టదాయకంగానే ఉన్నాయట. జన సమ్మర్దం తొలిగేందుకు స్కూళ్ళు, ఆఫీసు సమయాలలో మాత్రం అదనముగా బస్సులు నడపడానికి ఆర్.టి.సి నిర్ణయించింది. ఇటువంటి పరిస్థితులలో బస్సుల్ని సిటీరూట్ల మీద కచ్చితంగా సమయం ప్రకారం నడపడం అసాధ్యమే అవుతున్నట్లు ఆర్.టి.సి. పేర్కొన్నది.

గత మూడేళ్ళలో అక్రమార్జనకు పూనుకున్న 459 మంది కండక్టర్లు బర్తరఫ్ అయ్యారనీ, అనేక మందికి చిన్నశిక్షలు విధించబడినాయనీ, యీ చర్యలు 7 స్థర శాతం సిబ్బందిపై తైకొనబడినాయనీ, ఈ లెక్క ఆధారముగానే ఆర్.టి.సి లో అక్రమార్జన దాదాపు 2 శాతం ఉందని భావించబడిందని, అనంతకృష్ణన్ కమిటీ పేర్కొన్నట్లు ఈ అక్రమార్జన 30 శాతము (అంటే ఒక్కొక్క కండక్టరు నెలకు రు. వెయ్యి అక్రమంగా ఆర్జిస్తున్నట్లే) లేదనీ, ఆర్.టి.సి. ప్రకటన స్పష్టపరచింది. దేశంలో ఎక్కడా లేనంతగా పన్నువిధించబడుతున్న ఆంధ్రప్రదేశ్‌లో అనంతకృష్ణన్ కమిటీ సూచించినట్లు బస్సులకు 15 వేల చొప్పున 8 వేల బస్సులకు 4 స్థర కోట్ల ఆదాయము సంపాదించడం అసాధ్యమని కూడా ఈ ప్రకటనలో తెలుపబడింది.

దుబ్బాక పంచాయత్ సమితి

వివిధ అభివృద్ధి కార్యక్రమాలకై డబ్బు కేటాయింపు

మెదక్, జులై 5

సిద్దిపేట తాలూకాలోని దుబ్బాక పంచాయత్ సమితి క్రిందగల అన్ని పాఠశాలలకు విద్యాబోధన పరికరాలు కొనడానికి రు. 2 వేలు అలాట్ చేయబడినవి.

పంచాయత్ సమితి స్టాండింగ్ కమిటీ పుస్తకాలు క్రీడావస్తువులకొనడానికి రు. 9 వేల అలాట్ చేసింది.

ఈ బ్లాకు ప్రాంతంలో వ్యాయామ శాలలు గూడా ఏర్పరచబడగలవు.

వ్యవసాయపునులకై రు. 24,975 మేరకు ఋణాలుఈకమిటీ మంజూరు చేసినది. పశువుల కృత్రిమ గర్భోత్పత్తి కేంద్రం గూడా ఈ బ్లాక్ ప్రాంతంలో ఏర్పాటు చేయబడగలదు.

సమితి క్రిందగల 19 గ్రామాలలో ఉన్నట్టి సహకార పరపతి సంఘాలను నీవా సహకార సంఘాలుగా మార్చుటకు నిర్ణయింపబడినది. 1961-62లో ఈ సంఘాలకుగాను రు. 7 లక్షలు ఋణాలుగా ఇవ్వడానికి అలాట్ చేయడమైనది.

లచ్చపేటలో చర్మకారపరిశ్రమను చౌదర్ పల్లి గ్రామంలో కుమ్మరివారలకై పరపతి కేంద్రాన్ని ఏర్పాటు చేయుటకు గూడా సమితి స్థాయీ సంఘం నిర్ణయించింది.

సిక్కింలో రోడ్లనిర్మాణం

సిక్కిం మహారాజకుమార్ హర్ష ప్రకటన

గాంగ్‌టాక్, జులై 5

భారతప్రభుత్వము సిక్కింలోరోడ్లు నిర్మించడం హర్షదాయకమని సిక్కిం మహారాజకుమార్ ఇక్కడ అన్నారు. అంతకుముందు ఇక్కడ కేంద్ర పబ్లిక్ వర్క్స్‌శాఖ సమావేశములో భారత నిర్మాణాల, వరఫరాశాఖమంత్రి డా॥ తెజవాడ గోపాలరెడ్డి ప్రసంగించిన అనంతరము ఒక ప్రత్యేక గోష్ఠిలో సిక్కిం మహారాజ కుమార్ పై విషయము చెప్పారు. ఆ సమావేశానికి సిక్కింమహారాణి, సిక్కిం మహారాజ కుమార్‌లు హాజరయ్యారు.

గాంగ్‌టాక్ నుంచి లాంఛెన్ వరకు రోడ్డు నిర్మించాలన్న కోరిక యీ నాటిది కాదనీ, భారతప్రభుత్వము యీరోడ్డు నిర్మించడము ముదావహమైన విషయమనీ ఆయన చెప్పారు ఈ ప్రాంతములో రోడ్ల నిర్మాణం తేలిక పనికాదనీ, యీసంవత్సరము ఏప్రిల్‌లో ప్రారంభమైన సిక్కిం ద్వితీయ ప్రణాళిక మొత్తము వ్యయం రు.8 18 కోట్లలోనూ 40 శాతం రోడ్ల నిర్మాణానికే వెచ్చింపబడుతుందనీ ఆయన తెలియజేశారు. అయి దేశాలలో సిక్కిం అంతటా మంచిరోడ్లు వేయడమవుతుందని తాను భావిస్తున్నానని ఆయన అన్నారు.

సినిమా ఉద్యోగులకు కనీస వేతనాల నిర్ణయించుటకు ఏర్పరచబడిన కమిటికి దాని రిపోర్టును అందచేయుటకై ఆగస్టు 28వరకు గడువు ఇవ్వబడినది.

ఢిల్లీ రాజ్యసభ సభ్యులు

శ్రీ దేవులపల్లి రామానుజరావు బి ఏ., యల్. యల్. బి., మరియు ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడమీప్రధానకార్యదర్శి, తిలక్ రోడ్ (బొగ్గుల కుంట), హైదరాబాద్ నుండి ఇట్లు తెల్పుచున్నారు. డాక్టర్ లుఖ్మాన్ సాహెబ్ నాకు ప్రత్యేక కంటి డాక్టరు. నా వయస్సు 20సం॥ ఉండెను. అనగా 24 సంవత్సరములనుండి నా నేత్రములు డాక్టర్ లుఖ్మాన్‌గారి వల్ల భద్రముగా ఉన్నవి. వారికి నా కృతజ్ఞతలు. నేను నిజాంకాలేజీ విద్యార్థిదశ నుండి గత 20 సంవత్సరములలో 4, 5 మారులు నేత్ర పరీక్ష చేయించి కంటి అద్దములు మార్చితిని. వీటిని తన స్వంత ఖర్చానాలో తన పర్యవేక్షణక్రింద చేయించి ఇచ్చిరి. నా నేత్రములకు చాల మేలు మరియు హాయి గూర్చినవి. వీరు శీతరముల నుండి ఈ నేత్రపరీక్షలో అమోఘ అనుభవముగల కుటుంబములోనివారు. వారి వంశానుగత అనుభవమే మరింత అనుభవము గలుగుటకు కారణము. ఈకారణాన దినదినము ప్రఖ్యాతి వహించుచున్నారు. డాక్టర్ లుఖ్మాన్‌గారి నుండి నేత్రవ్యాధి బాధితులు తగు సేవ లభింపజేసికొనగలరని తోటి ప్రజానీకానికి నమ్మకమైన సలహా ఇస్తున్నాను.

6-3-59 (సం॥)

మీరును మీ నేత్ర పరీక్ష చేయించుకొని, కంటి అద్దములు ఎన్నుకొనుటకు దేశపు ప్రఖ్యాత నేత్ర పరీక్షా నిపుణుని సేవలను పొందండి. స్త్రీలకు ప్రత్యేక వర్గాయేర్పాటు గలదు.

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

6 జూలై 1961

గురు వారము

వరంగలులో విశ్వవిద్యాలయము

ఈ వారము వరంగలు నగరమున జరిగిన ఒక సభలో జిల్లా కలెక్టరు ప్రసంగించుచు, వరంగలు నగరము విద్యా విషయకముగా దినదినాభివృద్ధి నొందుచున్నదనియు, యీ అభివృద్ధి దృష్ట్యా యిక్కడ ఒకవిశ్వవిద్యాలయము (కాకతీయ విశ్వవిద్యాలయము) ను నెలకొల్పవలసిన ఆవశ్యకత కలదనియు ఉద్ఘాటించినారు. అంతే కాదు ప్రభుత్వము యీ విషయములో శ్రద్ధ దీసికొనినచో ప్రజలు సర్వవిధాల సహాయపడగలరని కూడ జిల్లాకలెక్టరుగారు తెలిపినారు. జిల్లాకలెక్టరువంటి బాధ్యతగల ఉద్యోగి తెలిపిన యీ మాటలకు తగు విలువను యీయవలసియుండును.

కొంత కాలము క్రింద ఆంధ్రప్రదేశ్ విద్యా మంత్రివర్యులు శ్రీ పట్టాభిరామారావు గారు ఒకచోట మాట్లాడుచు గుంటూరు ప్రాంతములో నాగార్జున విశ్వవిద్యాలయమును స్థాపించుట బాగుండ గలదని సూచించియున్నారు. ఈ విషయమై యిప్పటి వరకు యేమి యేర్పాటులు జరిగినవో తెలియదు. గుంటూరుప్రాంతములో నాగార్జున విశ్వవిద్యాలయ స్థాపన ఉద్దేశము సమంజసమైనది. అదేవిధముగా వరంగలు ప్రాంతములో మరొక విశ్వవిద్యాలయమును కాకతీయ విశ్వవిద్యాలయమను పేరుతో స్థాపించుట సమంజసముగా నుండగలదు.

ఆంధ్రప్రదేశ్‌లో వరంగలు, ముఖ్యమైన నగరాలలో ప్రత్యేకముగా పేర్కొనదగిననగరము. చారిత్రకముగా వరంగలుకు గల స్థానము సుప్రసిద్ధమైనది. మొత్తము తెలుగు సీమను ఒక పరిపాలన క్రిందికి తీసికొనివచ్చి, ప్రజలలో ఆంధ్రత్వ భావమును కలిగించిన రాజ్యమునకు వరంగలు ప్రధాన కేంద్రమైన సత్యమును చరిత్ర ఉద్ఘాటించుచున్నది. ఆంధ్ర సంస్కృతికి, ఆంధ్ర సాహిత్యమునకు, శిల్పమునకు ఓరుగల్లు నగరము ఆటపట్టయిన సత్యమును గూడ వేరుగా వివరించవలసిన ఆవశ్యకత లేదు. ఓరుగల్లు తెలంగాణమునకు కేంద్రస్థానమైయున్నది. అందుచేత యిక్కడ నెలకొల్పుయే సంస్థయైనను మొత్తము తెలంగాణానికి చెందిన సంస్థగా నుండగలదు.

గతములోనే కాదు, యీనాడుకూడ వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యము కలదు. తెలంగాణములో వర్తకానికి వరంగలు కేంద్రస్థానమైయున్నది. హైదరాబాదు నగరము తరువాత మన రాష్ట్రములో వరంగలు పట్టణమే సర్వవిధాల ముఖ్యమైన పట్టణమని చెప్పవచ్చును. దక్షిణము నుండి, ఉత్తరప్రాంతానికి రాకపోకలకు వరంగలు కూడలియై యున్నది. ఇక్కడ ఉత్తమ విద్యాసంస్థలు కొన్ని కలవు. ఒక డిగ్రీకళాశాల, ఒక టెక్నికల్ కళాశాల, ఇంజనీయరింగ్ కేంద్రకళాశాల, వైద్యకళాశాల మొదలైన సంస్థలు వరంగలు పట్టణ ప్రాధాన్యమునకు మంచి నిదర్శనములై యున్నవి. ఏనాటికైనను వరంగలులో ఒక వ్యవసాయకళాశాల, పశువైద్య కళాశాల స్థాపితము కావలసియుండును. ఈ రెండు కళాశాలలు స్థాపితమైనచో, ఒక విశ్వవిద్యాలయానికి కావలసిన పరిపుష్టత వరంగలునగరానికి కలుగగలదు.

విశ్వవిద్యాలయ స్థాపన మాట యెట్లున్నప్పటికిని, అందులో యెంత ఆలస్యము జరిగినప్పటికిని, వ్యవసాయ, పశువైద్య కళాశాలల స్థాపన తత్క్షణమే సాధ్యము కాకపోయినప్పటికిని, వరంగలు నగరములో వెంటనే రెండు సంస్థలు స్థాపితము కావలసిన ఆవశ్యకత కలదు. ఒకటి మహిళా కళాశాల మరియు దాని కనుబంధముగా మహిళా వసతిగృహము; రెండు న్యాయశాస్త్రకళాశాల. ఉస్మానియా విశ్వవిద్యాలయము తత్క్షణమే ఒక న్యాయశాస్త్ర కళాశాలను వరంగలులో స్థాపించవచ్చును. ఇందుకు ప్రత్యేకముగా వ్యయ ప్రయాసలు యేమియును ఉండజాలవు. ఈ రెండు సంస్థలు స్థాపితమైనచో వరంగలుజిల్లాకే కాక ఖమ్మం, ఆదిలాబాదు, కరీంనగర్, నల్లగొండ జిల్లాలకు ఉపయోగకరముగా నుండగలదు. కావున బాధ్యతగల జిల్లాకలెక్టరువంటి ఉద్యోగులు వరంగలుపౌరులు యీవిషయమై తగు శ్రద్ధను తీసికొని, కార్యసాధన గావించగలరని ఆశించుచున్నాము. ...

ఆచార్య శంకరుల విగ్రహ ప్రతిష్ఠ

(స్వ.వి)గుంటూరు, జులై 5

శ్రీ శృంగేరీ జగద్గురువులు ఇచ్చటికి విచ్చేసిన సందర్భంలో శ్రీ శంకర మఠంలో ఆచార్యశంకరులవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ మఠానికి శ్రీ స్వాములవారే వెనుకగుంటూరు వచ్చినప్పుడు శంకుస్థాపన గావించారు.

అనంతరం జరిగిన ఆంధ్రప్రదేశ్ దేవాలయ ధర్మకర్తల సభలో శ్రీయుతులు కల్లూరి చంద్రమౌళి, దేవాదాయ మంత్రి పైడిలక్ష్మయ్య, దేవాదాయ శాఖాధిపతులు అవుటపల్లి హనుమంతరావు, ముదిగొండ వెంకట్రామశాస్త్రి, లక్ష్మీకాంత యోగి ప్రభృతులు దేవాలయాలు, వాని ఆస్తుల నిర్వహణ, హైందవ ధర్మాలు, వాని అనుష్ఠానం ఇత్యాది విషయాలపై గంభీరోపన్యాసాలు గావించారు.

శ్రీ శృంగేరీ పీఠంలో నెలకొల్పవలసినదిగా కోరుతూ మంత్రి కల్లూరి చంద్రమౌళిగారు రజత శారదా విగ్రహాన్ని ధర్మకర్తల పక్షాన శ్రీశృంగేరీ స్వాములవారికి సమర్పించారు. రజత ఫలకంమీద సువర్ణాక్షరాలతో చెక్కబడిన ఒక సన్మానపత్రాన్ని స్వాముల వారికి ఆహ్వాన సంఘంవారు సమర్పించారు.

శ్రీ జగద్గురువులు ఉచిత రీతిని సమాధానమిస్తూ ఆర్ష సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ దాని ఆవశ్యకత, మొదలయిన అంశాలపై ఉపన్యసించారు. ...

హిందీ అర్ట్సుకాలేజి హైదరాబాదులో తరగతులు జరుగుతున్నవి. కేంద్ర విద్యామంత్రి డా॥ శ్రీ మాలి ఈనెల 14న లాంఛనపూర్వకముగా ఈకళాశాలకు ప్రారంభోత్సవము చేస్తారు. ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు.

స్థిర సం॥ విజ త్వేష్ఠ ॥ నవమి
తా. 7-35 అశ్విని తా. 9-36
తా. వ. 11-35 మొ: 1-11 వరకు
(శాలివాహన శకము: 15-4-1883)
6-7-1961 గురువారము

> "కాలముఁ బర్జన్యుండును
> నేలయు సస్యంబుఁ
> గ్రియయు శిష్క్రియయును ధర్మాలోకము
> నై మహిమ న్లీల సలుపు
> వాసుదేవునిం బ్రణుతింతున్."
>
> — భారతము(శాంతి)

భౌతిక, ఆధ్యాత్మిక విద్యల సమన్వయం

చేయగల విద్యావిధానం ప్రస్తుతావసరమని మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి వివరణ

(స్వ. వి.)గుంటూరు, జులై 5

ఆగస్టు నెలలో కేంద్రప్రభుత్వము తిరుపతిలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఒకదానిని స్థాపించనున్నదనీ, దక్షిణాదిన విశ్వవిద్యాలయము ద్వారా సంస్కృత భాషకు మంచి భవిష్యత్తు ఏర్పడగలదని, సంస్కృత భాషావ్యాప్తికై కేంద్ర ప్రభుత్వము చేస్తున్న పనులలో ఈవిశ్వవిద్యాలయ స్థాపన ముఖ్యంగా గణనీయమైనదని శ్రీ కల్లూరి చంద్రమౌళి (ఆంధ్రప్రదేశ్ దేవాదాయ మంత్రి). డాక్టరు కె.వి. కృష్ణమూర్తి సంస్కృత కళాశాల వార్షికోత్సవ సందర్భంలో మాట్లాడుతూ అన్నారు.

దేవాదాయ శాఖాధిపతులు శ్రీ పైడిలక్ష్మయ్య సభాధ్యక్షత వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో అభివృద్ధికావలసిన ఈ సమయంలో సంస్కృతభాషా పరివ్యాప్తికై చాలా కృషి జరుగాలనీ, ఇదితప్ప మరో మార్గంలేదనీ ఆయన అన్నారు. సంస్కృతం చదివినవారికి తగిన ప్రోత్సాహం లేదు గనుక, సంస్కృత పాఠశాలలు తక్కువైనవనీ, కాని ఈ దుస్థితి తొలగిపోవాలని అన్నారు.

మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి గారు మాట్లాడుచూ, నేటినవీనవిద్యా విధానానికి భౌతికదృష్టితప్ప, ఆధ్యాత్మికదృష్టి లేదనీ, తత్కారణంగానే నేడు సమాజంలోగానీ, దేశంలోగానీ అనర్థాలు గల్గుతున్నవనీ అన్నారు. భౌతిక విద్యను, ఆధ్యాత్మిక విద్యను సమన్వయంచేయగల విద్యావిధానమే దేశానికి ఎంతో మేలుచేకూర్చగలదనీ, అట్టి విధానాన్ని రూపొందించటానికి ప్రయత్నాలు జరుగాలనీ అన్నారు.

"సంస్కృత విశ్వవిద్యాలయాలను నెలకొల్పటానికి ఉదారులైన వారు పూనుకోవాలి. ప్రభుత్వమే ఆ పని చేయాలనటం మంచిది గాదు. చిన్న చిన్న పనులు గూడా ప్రభుత్వమే చేయాలంటే ఎలా? ధనాఢ్యులు, వదాన్యులు తమ ధనాన్ని సరిఅయిన విధంగా ఖర్చుపెట్టాలి. నీతి నిజాయితీలతో ధర్మబద్ధంగా ధనసంపాదించాలి. అలా సంపాదించిన దాన్ని సద్వినియోగము చేయాలి. అదే ఉన్న వారి ఉత్తమ కర్తవ్యం."

"నాగరికత అంటే భోగభాగ్యాలతో కూడిన జీవితాన్ని నడపటం గాదు. అదే అని అనుకోవటం జరిగితే ఇంక మనిషికి, పశువునకు తేడాలేదన్నమాట. ధనసంపాదనమే, భోగాలనే జీవితమే నాగరికత చిహ్నాలను కోవటం తప్పు. ఈ సత్యాన్ని గుర్తించి, తదనుగుణంగా వ్యవహరించనంత కాలము దేశానికీ, జాతికి శాశ్వత శాంతి భద్రతలు లేవు. శరీరాన్ని ఎంత అలంకరించినా, అందులో చైతన్యము లేకపోతే అది నిష్ప్రయోజనము" అని కూడా మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి అన్నారు.

"సంస్కృత భాషను మనం ఎంత వర్ధన్నా, దాన్ని ఎంత పనికి మాలిన దనిఅన్నా, అది రాణిస్తూనేఉంటుంది. విశ్వవిశ్వాలు ఉన్నంత కాలము ఆ భాష సూర్య మండలము మాదిరి బ్రహ్మాండమైన వెలుగుతో ప్రకాశిస్తూనే ఉంటుంది. అది అభివృద్ధి అవుతూనే ఉన్నది. ఈ సత్యాన్ని గుర్తించాలి" అని అన్నారు మంత్రి

అనంతరం శ్రీ శృంగేరీ పీఠాధిపతి మాట్లాడుచూ, దేశంలో సమైక్యతను సాధించటానికి సంస్కృత భాష ఒక్కటే ఉపయోగపడుతుందని, దేశం అంతా ఒక్కటేనన్న భావం కల్గించటానికి ఈభాష ఒక్కటే తోడ్పడుతుందనీ, ఇందుకో నిదర్శనముగా భారతదేశము మొత్తంమీద అటుకాశీ, బదరీనాథ్ ఇత్యాది దేవాలయాలకు వెళ్ళినా, ఇటు తిరుపతి, కంచి, మధుర, రామేశ్వరం ఇత్యాది క్షేత్రాలను సందర్శించినా సంస్కృత భాషలో ఒకే అనుష్ఠానం, ఒకే మంత్రాలు పఠింపబడతవన్న అంశం కనిపిస్తున్నదనీ అన్నారు.

శ్రీ స్వాములవారు ఇంకను అనేక విషయాలను గూర్చి ప్రసంగించి, ఈ సంస్కృత కళాశాలకు భవనాలను సమర్పించిన డాక్టరు కృష్ణమూర్తి గారి వదాన్యతను ప్రస్తుతించారు.

డాక్టరు కృష్ణమూర్తి దంపతుల ఛాయా చిత్రాన్ని మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి ఆవిష్కరించారు. కళాశాలకు సంబంధించిన వివరాలను శ్రీ వడ్లమూడి గోపాల కృష్ణమూర్తి గారు తెలియజేశారు.

భారతీయ విద్యాభవన్ (బొంబాయి) సంస్కృత భాషా ప్రచారిణీ సభ (చిత్తూరు) వారి పరీక్షలలో గెలుపొందిన విద్యార్థులకు శ్రీ పైడి లక్ష్మయ్య యోగ్యతా పత్రాలను పంచిపెట్టారు.

కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కాపూరి సుబ్బరామయ్య వందన సమర్పణ గావించారు.

ధూల్‌పేటలో నాటుసారా ఉత్పత్తి

పోలీసు మరియు ఎక్సైజు ఉద్యోగుల గాలింపు

హైదరాబాద్, జులై 5

నిన్న ధూల్‌పేటలో గంటన్నర సేపు పోలీసు మరియు ఎక్సైజుశాఖ ఉద్యోగులు నాటుసారాకై సోదా చేశారు. పాతఇనాయత్‌గంజ్‌పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టరు పద్మారావు ఎక్సైజు పోలీసు ఇనస్పెక్టరు సుదర్శన్ రెడ్డి ఈ ప్రాంతములో పెక్కు ఇండ్లను సోదాచేశారు. ఈ సందర్భముగా 80గ్యాలన్ల సారాపట్టుబడినది. అరు సారా భట్టీలుగూడా పోలీసులు కనుగొన్నారు. వీరు 8వేల గ్యాలన్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

నగరంలోని ధూల్‌పేట మొదలగు బస్తీలలో నాటుసారా ఉత్పత్తి కుటీర పరిశ్రమగా కొనసాగుతున్నది. ఈ వ్యాపారాన్ని తుదముట్టించడానికై పోలీసు మరియు ఎక్సైజుశాఖ ఉద్యోగులు గట్టి కృషి చేస్తున్నారు.

కాశ్మీరు అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు

మూడవ ప్రణాళికలో అధిక మొత్తం కేటాయించబడినదని శ్రీ దేశాయి వెల్లడి

శ్రీనగర్, జులై 5

కేంద్ర ప్రభుత్వము కాశ్మీర్ అభివృద్ధిపట్ల చాలా ఆసక్తిని కలిగి ఉన్నదని మూడవ ప్రణాళికలో కాశ్మీరుకు అధిక మొత్తాలు కేటాయింపబడినవని కేంద్ర ఆర్థికమంత్రి మొరార్జీ దేశాయి తెలిపారు.

కాశ్మీరు వాణిజ్య మండలి సమావేశములో ప్రసంగిస్తూ శ్రీ దేశాయి మూడవ ప్రణాళికలో కాశ్మీర్ రాష్ట్రానికి సంవత్సరానికి తల ఒక్కంటికి రు. 50 చొప్పున ప్రణాళిక వ్యయం పడగలదన్నారు. రెండవ ప్రణాళికాకాలములో కాశ్మీరుపై సంవత్సరానికి తల ఒక్కంటికి రు. 20 చొప్పున ఖర్చు చేయబడినది.

కాశ్మీరు లోయ అభివృద్ధికై రాష్ట్రప్రభుత్వము చేస్తున్న కృషిని శ్రీ దేశాయి ప్రశంసించారు.

మాస్కోలో టాగూరు శతజయంత్యుత్సవాలు

న్యూఢిల్లీ, జులై 5

మాస్కోలో జూన్ 30వ తేదీన అనేకమంది ప్రముఖ రష్యన్‌పౌరుల సమక్షంలో భారత ప్రభుత్వ శాస్త్ర పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ టాగూర్ వర్ణచిత్రాల ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరిపారు. అనేకమంది భారతీయ విద్యార్థులు కూడా యీ ఉత్సవానికి హాజరయినారు. ఆచార్య కబీర్ విశ్వకవి టాగూర్ మానవతావాదంపై ప్రసంగించి శ్రీ టాగూరు నిజమయిన పర్యటక పౌరుడుగా నిరూపించుకొన్నదీ వివరించారు. అటుతర్వాత రష్యాదేశ అధికారులు టాగూరుపై తీసిన ఒకచిత్రం ప్రదర్శింపబడింది. ఆ సాయంత్రం రాయబార కార్యాలయంలో విందు ఏర్పాటు చేయబడింది. ఈ విందుకు ప్రెసిడియంసభ్యురాలు శ్రీమతి ఫర్తు సేవాతో పాటు రష్యాలోని అనేకమంది ప్రముఖవ్యక్తులు హాజరయినారు.

వెనిజులాకు రాష్ట్రపతిఅభినందన సందేశం

న్యూఢిల్లీ, జులై 5

వెనిజులా జాతీయ దినోత్సవ సందర్భంగా వెనిజులా రిపబ్లిక్ అధ్యక్షునకు భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ యీ క్రింది అభినందన సందేశం పంపారు:

"మీజాతీయ దినోత్సవ శుభ సమయంలో మీకు, మీద్వారా మీ ప్రభుత్వానికి, మీ ప్రజలకూ నా తరపునా, భారత ప్రభుత్వం తరపునా, భారత ప్రజల తరపునా హృదయపూర్వకాభినందనలు. మీకు సౌఖ్య సంపద చేకూరాలనీ, మీ దేశప్రజలు ప్రగతి మార్గములో నిరంతర సంక్షేమ సౌభాగ్యాలతో వర్ధిల్లాలనీ మా గాఢమైన ఆకాంక్ష".

రహింపురలో ఉన్న సురాబాండేశ్వర గౌండ్లమఠం ముతవల్లి

శ్రీ గురుశంకరస్వామిని వారి హోదా నుండి తొలగించి జులై 2వ తేదీన దేవాదాయశాఖవారు మఠాన్ని తమ స్వాధీనములోకి తీసుకున్నారని తెలుస్తున్నది.

మతపాక్షిక సదస్సులు ఏజాతి అభివృద్ధికైనా క్షేమకరం కావు

కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డి ఉద్ఘాటన

హైదరాబాద్, జులై 5

ఏజాతి అభివృద్ధికైనా మతపాక్షికముగా సదస్సులను నిర్వహించుట క్షేమకరము కాదని నేడిచట విలేఖరులతో మాట్లాడుచు కాంగ్రెసు అధ్యక్షులు శ్రీనీలం సంజీవరెడ్డి అభిప్రాయపడ్డారు.

హిందూ సదస్సును నిర్వహించు ప్రతిపాదనను గూర్చి మాట్లాడుచు మతరహితమైనట్టి భారత దేశమువంటి దేశములో మతపాక్షిక సదస్సులు నిర్వహించుట దురదృష్టకరమని, అట్టి సదస్సులవల్ల చిక్కులుత్పన్నమౌతాయని ఆయన అన్నారు.

కాంగ్రెసు శాసన సభ్యులను, కాంగ్రెసు వాదులను ముస్లిం సదస్సులో ఈమధ్య యెందుకు పాల్గొనిచ్చారని ఒక విలేఖరి ప్రశ్నించగా అన్నియేర్పాట్లు పూర్తిఅయిన తరువాత కాంగ్రెసు వర్కింగ్ కమిటీకి సదస్సు ఉద్దేశాలు తెల్లమయ్యాయని, అట్టి దశలో కాంగ్రెసు వాదులనందు పాల్గొనీయకుండా చేయుట లేక సదస్సునే రద్దుపరచుట తీవ్ర పరిణామాలకు దారితీసేదని శ్రీ సంజీవరెడ్డి చెప్పారు.

మతరహితమైనట్టి భారతదేశంలో మతపాక్షిక సదస్సులను ప్రోత్సహించగూడదని అట్టి సదస్సులు దేశానికి శ్రేయోదాయకము కావని ఆయన చెప్పారు. దేశైక్యతకు భంగకరమైనట్టి కుల, మత, భాషా సంకుచిత దృక్పథాలను ప్రోత్సహించుట మానాలని రెడ్డిగారు కోరారు.

అల్పసంఖ్యాకులు, అధిక సంఖ్యాకులు అను ప్రాతిపదికపై యేవర్గము కూడ ప్రత్యేక రక్షణలను కోరకూడదని, అన్నివర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని ఆయన తెలిపారు.

రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై విభజించుటను కాంగ్రెసు అధ్యక్షులు సమర్థించారు. అయితే అట్టి విభజన దేశ ఐక్యతకు భంగకరము కారాదనే విషయాన్ని ప్రతియొకరు గుర్తుంచుకోవాలని ప్రతియొకరు భారతమాత యెడల భక్తి ప్రపత్తులను కలిగి యుండాలి కాని ఆంధ్రమాత తదితర రాష్ట్రమాతలను సృష్టిస్తూ దేశైక్యతకు భంగపాటు కలిగించగూడదని ఆయన అన్నారు.

షోంబే చేసుకున్న ఒప్పందాలు

చెల్లనేరవని కటాంగా దిగువ సభ ప్రకటన

ఎలిజబత్‌విల్లి, జులై 5

కటాంగా పార్లమెంటు దిగువ సభ కటాంగా అధ్యక్షులు షోంబే ఆ మధ్య లియోపాల్డువిల్లి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు చెల్లనేరవని ప్రకటించింది. లియోపాల్డువిల్లిలో షోంబే స్వేచ్ఛగాలేడని ఒత్తిడి నిర్బంధంతో చేసుకోబడిన ఆ ఒప్పందాలు చెల్లజాలవని కటాంగా దిగువసభ పేర్కొన్నది.

ఘుఛియిమ్‌లాంగ్‌లో నాగా విద్రోహుల కాల్పులు

ఇద్దరు విద్యార్థుల మరణం

షిల్లాంగ్, జులై 5

మొకోక్‌చుంగ్‌నకు తొమ్మిది మైళ్ళ దూరములో ఘుఛియిమ్ లాంగ్‌లో జులై 1వ తేదీన కూడిన జనముపై నాగా విద్రోహులు కాల్పులు జరుపగా యిద్దరు విద్యార్థులు తక్షణమే మరణించారని నిన్న ఇచట అధికారికత్యా తెలిసింది.

నాగాప్రాంత ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ ఏలోఆవ్‌నకు స్వాగతము చెప్పేందుకై కూడిన యీజనములోని విద్యార్థులు కార్యక్రమానంతరము జాతీయగీతాలాపన చేయుచుండగా విద్రోహులు 800 గజాల దూరము నుండి కాల్పులు జరిపారట. రక్షకభటులు కూడ వ్యతిరేక కాల్పులు జరిపారట. కాని విద్రోహులందరూ పారిపోయారు.

నాగాప్రాంత పరిస్థితులనవగతము చేసుకొనేందుకై సలహా సంఘ సభ్యులు నాగాప్రాంత అంతర్భాగములను పర్యటిస్తున్నారు. నాగాప్రాంత ప్రజలు కూడ అభివృద్ధి కార్యక్రమాల్లో పాలక వర్గముతో సహకరిస్తున్నారు. యీ ప్రాంతములో చాలా భాగము నాగా విద్రోహుల ప్రభావం నుండి తొలగించబడిందని కౌన్సిలర్ల వల్ల తెలిసింది.

మత కలహాల నివారణ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్య తీసుకోవాలని అభ్యర్థన

హైదరాబాదు, జులై 5

మత సంబంధమైన కలహాలు ఉత్పన్నమవకుండా ప్రభుత్వము గట్టి చర్యలు తీసుకోవాలని జమయతుల్ ఉలేమా ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రభుత్వాన్ని అభ్యర్థించినది.

ఈమధ్య జబల్‌పూర్ సాగర్‌లలో జరిగిన మత కలహాల ప్రస్తావిస్తూ ఇట్టి సంఘటనలు తిరిగి జరుగకుండా కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు గట్టి చర్యల తీసుకోవాలని ఒక తీర్మానము ద్వారా కోరినది. జిల్లాలలో పరిపాలనా వ్యవస్థ యందు అల్పసంఖ్యాకులకు తగు ప్రాతినిధ్యము ఇవ్వాలని ఇట్టి కొట్లాటలందు నష్టపోయిన వారికి తగు పరిహారాన్ని ఇప్పించాలని గూడా జమయతుల్ ఉలేమా రాష్ట్ర శాఖ కోరినది.

చేతిబాంబు ప్రేలి ఇద్దరు బాలుర మృతి

న్యూఢిల్లీ, జులై 5

తెలియకఆడుకుంటున్న చేతిబాంబు పేలిగా ఇక్కడికి 12మైళ్ళ దూరములోగల ఖాన్‌పూర్‌లో ఇద్దరు బాలురు మరణించారు.

రష్యా-చైనాల మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు

మావో ప్రవర్తన మూడవ ప్రపంచయుద్ధాన్ని తెచ్చిపెట్టేట్లుందని క్రుశ్చేవ్ విమర్శ

లండన్, జులై 5

రెండు కమ్యూనిస్టు రాజ్యాలకు అధినాయకులైన రష్యాప్రధాని క్రుశ్చేవ్, చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రముఖుడు మావ్ సేటుంగ్ మధ్య అనుకోనిరీతిగా భేదాభిప్రాయాలు తలెత్తినవని యిచట విశ్వసనీయంగా తెలిసింది.

క్రుశ్చేవ్ ప్రపంచ కమ్యూనిస్టు ప్రముఖులకు అంపిన సర్క్యులర్ లో మావోను గూర్చి కఠినముగా విమర్శించాడట

మాస్కో, పెకింగ్‌ల మధ్యనున్న భేదాభిప్రాయాలను అంతము చేసిందని యెంచబడుచున్న గత నవంబర్ మాస్కో ప్రకటనను గౌరవించకుండా మావోప్రవర్తిస్తున్నందున ఈ విభేదాభిప్రాయాలు తలెత్తినవి.

శాంతి యుత సహజీవనమును వ్యతిరేకిస్తూ మావోసంకుచితత్వముతో ప్రవర్తిస్తున్నాడని, విదేశీ కమ్యూనిస్టు పార్టీలతో ఏకపక్షంగా సంబంధాలేర్పరచుకొనుటకు యత్నించుచున్నాడని, యిట్టి ప్రవర్తన లెనిన్ సమష్టిచర్య సిద్ధాంతానికి వ్యతిరేకమైనదని క్రుశ్చేవ్ ఆరోపించాడు. అంతే కాకుండా 8 మాసాల క్రితం కుదుర్చుకున్న ఒడంబడికలనన్నిటిని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 82వ కాంగ్రెసులో రద్దుపరుస్తూ ప్రకటిస్తామని కూడ క్రుశ్చేవ్ బెదిరించాడు.

ముందు తమతో ఆలోచించకుండా మావోప్రవర్తిస్తున్నాడని నిరూపించుటకు క్రుశ్చేవ్ దృష్టాంతంగా అల్బేనియాపట్ల మావో ప్రవర్తనను పేర్కొన్నాడు. ఆయన ప్రవర్తనలో ప్రపంచయుద్ధాన్ని తెచ్చిపెట్టేట్లుయుందని కూడ ఆయన విమర్శించాడు.

లేఖావళి

విఠల్‌వాడిలోగల పబ్లిక్ నల్లా

ఆర్యా!

నారాయణ గూడెం విఠల్ వాడి ఆంజనేయ దేవాలయం ప్రక్కనగల పబ్లిక్ నల్లా సిమెంటురోడ్‌కు ఆనుకొని రెండడుగుల లోతున ఉండుట వలన రోడ్ చాలా ఇరుకుగా ఉంది. వచ్చిపోయే సైకిళ్లు, రిక్షాలు ప్రమాదవశాత్తు ఆ గుంటలోపడి వాటిపై ప్రయాణం చేసేవారు గాయపడటం తరుచుగా జరుగుచున్నది. మరియు నల్లావద్ద చుట్టుపక్కలవారు బట్టలు ఉతుకుట వలన రోడ్డుపైనడిచేవారిపై నీళ్ళుపడి తగాదాలుజరుగుతుండటం సర్వసాధారణమై పోయినది. అంతేగాక నల్లా వాచర్ పోయి ఏకధాటిగానీరుపోతుండటము వలన నల్లావద్ద బురద అయి దుర్గంధపువ

నాకు ప్రాణాస్పదము...



జమ్మీవారి లివర్‌కూర్

...నన్ను లివర్, స్ప్లీను బాధలనుండి రక్షించినది

జమ్మి వెంకటరమణయ్య & సన్స్ మద్రాసు-4

సికింద్రాబాద్‌లో తాజ్‌మహల్ హోటల్, సరోజినీదేవిరోడ్డునందు ప్రతి నెల 8 వ తేదీన ఉ॥ 9-00 నుండి 12-00 వరకు.

హైద్రాబాద్‌లో న్యూ తాజ్‌మహల్ హోటల్ (లాడ్జింగ్ సెక్షన్) పూర్వపు ఇండియన్ కాఫీహౌస్, రెసిడెన్సీ రోడ్డు నందు ప్రతి నెల 9వ తేదీ ఉ॥ 9-00 నుండి 12-00 గం॥ మా డాక్టరునుసంప్రదించవచ్చును.

ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

ప్రకటన నెం. (8)

ఆంధ్ర ప్రదేశ్ మినిస్టీరియల్ సర్వీసెస్, ఆంధ్ర ప్రదేశ్ జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీస్ మరియు ఆంధ్ర ప్రదేశ్ సెక్రెటేరియట్ సర్వీస్‌లో ఉద్యోగములకొరకు దరఖాస్తులు.

ఈ క్రింద తెలుపబడిన పదవులకు నేరుగా నియమించుటకుగాను ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌చే 1961 సం॥ లో జరుపబడు యస్. యస్. ఎల్. సి. స్టాండర్డు పోటీపరీక్షలలో ప్రవేశమునకు దరఖాస్తులు కోరబడుచున్నవి.

(1) ఆంధ్ర ప్రదేశ్ మినిస్టీరియల్ సర్వీస్ అండ్ ఆంధ్ర ప్రదేశ్ జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీసెస్‌లో లోయర్ డివిజన్ గుమాస్తాలు (ఎ) జామీను కొరకు ధరావత్తు ఉంచవలసినవి. (బి) ధరావతు ఉంచ నవసరము లేనివి.

(2) ఆంధ్ర ప్రదేశ్ సెక్రెటేరియట్ సర్వీస్‌లోను, ఆంధ్ర ప్రదేశ్ మినిస్టీరియల్ సర్వీస్‌లోను మరియు ఆంధ్ర ప్రదేశ్ జ్యుడిషియల్ మినిస్టీరియల్ సర్వీస్‌లోను టైపిస్టులు మరియు స్టెనో టైపిస్టుల కొరకు.

వయస్సు:- ముల్కీ సర్టిఫికెట్ లేని పక్షమున 1-7-1961 తేదీ నాటికి 25 సం॥ లోపు ఉండవలెను

ముల్కీ సర్టిఫికెట్ ఉన్న పక్షమున 1-7-1961 తేదీ నాటికి 30 సం॥ లోపు ఉండవలెను.

పైన చెప్పబడిన వయస్సు పరిమితులు నిమ్నజాతులు, నిమ్నతరగతులు ఏజన్సీ ప్రాంతములలోని కొండజాతుల అభ్యర్థులకు గాని లేక ఇతర వెనుకబడిన జాతుల అభ్యర్థులకు గాని కావలసిన మామూలు కనిష్ట విద్యాయోగ్యతలకంటె ఎక్కువ విద్యాయోగ్యతలు పొందియుండిన అభ్యర్థులకు చెందవు. కాని పైన చెప్పబడిన జాతులలో దేని కైనను చెందియుండి కావలసిన మామూలు కనిష్ట విద్యాయోగ్యతలకంటె ఎక్కువ గాని మామూలు విద్యాయోగ్యతలు కలిగిఉన్న అభ్యర్థుల విషయములో వయస్సు పరిమితి 5 సంవత్సరముల వరకు హెచ్చించ బడును.

విద్యాయోగ్యతలు:- యస్. యస్. యల్. సి లేక హెచ్. యస్. సి. లేక విశ్వవిద్యాలయ కోర్సులకు అర్హతగల హెచ్. యస్. సి. లేక మెట్రిక్యులేషన్ పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేక మామూలు కనిష్ట విద్యాయోగ్యతలు పొందియున్నవారు లేక సమానమైన యోగ్యతలు గలవారు.

కాంట్రాక్టులిక గవర్నమెంట్ ఉద్యోగులు, మిలిటరీ సర్వీస్‌గల అభ్యర్థులు (ఐ. యన్. ఎ. పని వాండ్రతో సహా) మాజీ బర్మా గవర్నమెంటు ఉద్యోగులు డిఫెన్సు డిపార్టుమెంటు నుండి తొలగింపబడ్డ సివిలియన్ ఉద్యోగస్తులు, సివిల్ సప్లయిస్ డిపార్టుమెంటునుండి తొలగింపబడ్డవారుగాని లేక అందులో పనిచేయుచున్నవారు మరియు కేంద్ర ప్రభుత్వపు రేషనింగ్ అండ్ సప్లయి శాఖలనుండి తొలగింపబడిన అభ్యర్థులకు వయస్సు పరిమితిలో కొంత రియాయితీ ఉంటుంది. పాకిస్తాన్ కాందిశీకులకు మరియు పటాలములు, నావికాదళము మరియు విమానదళములనుండి రద్దుచేయబడిన అభ్యర్థులకుగూడ వయస్సు, విద్యా యోగ్యతల పరిమితిలో కొంత రియాయితి యివ్వబడును.

పబ్లిక్ నేట్ సర్వీసెస్‌కు చెందిన అభ్యర్థులుగూడ పరీక్షకు దరఖాస్తులు పెట్టుకొనవచ్చును (ఇట్టివారి విషయములో యస్. యస్. ఎల్. సి. స్థాయిలో ఒక జనరల్ ఎడ్యుకేషనల్ టెస్టు ఉండగలదు) యెందుకనగా ప్రమోషన్‌కుగాని లేక బదిలీకుగాని లేక భాయపరచుటకు గాని లేక యెక్కువ వేతనము పొందుటకు గాని లేక తదితర సౌకర్యములు పొందుటకు ఇది అవసరము.

కమిషన్ కార్యాలయములో దరఖాస్తులు అందజేయుటకు 29-7-61 ఆఖరు తేది.

పూర్తి వివరములు మరియు దరఖాస్తుఫారములు కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, హైద్రాబాద్ (ద) వారి కార్యాలయము నుండి పదవిపేరు మరియు అడ్రసుగల స్టాంపుకవర్ పంపుతూ లిఖిత పూర్వకముగా కోరినయెడల పొందగలరు ఇట్టి కవరును పంపని దరఖాస్తులు అంగీకరింపబడవు.

(నోటు:- స్వంత అడ్రసుగల కవరు దీర్ఘచతురస్రములో కనీసము 9 అంగుళములు పొడవు కలిగి 15 నయాపైసలు స్టాంపు అంటించి యుండవలెను.)

ప్రకటన

1945 కంటోన్‌మెంట్ ఎన్నికల నిబంధనల యొక్క 8వ నిబంధనలో కోరబడిన ప్రకారము సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డు యొక్క ప్రాథమిక ఎన్నికల జాబితాలు ప్రచురించబడి సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డు కార్యాలయములో ప్రదర్శించ బడుచున్నవని ఇందు మూలమున సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ ప్రాంతములోని ప్రజలకు తెలుపనైనది. కంటోన్‌మెంట్ వోటర్ల ప్రాథమిక ఎన్నికల జాబితాలు తనిఖీకొరకు పైకార్యాలయములో ప్రతిరోజు ఉదయం 11-00 నుండి 4-00 వరకు 20-7-1961 వరకు తెరచియుంచబడును.

సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డు కార్యాలయం
తేది: 1-7-1961

(సం) ఎన్. ఎస్. గిల్,
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
సికింద్రాబాద్ కంటోన్‌మెంట్.

ఆకాశవాణి

హైద్రాబాదు-ఎ

శుక్రవారం, జులై 7

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తి రంజని: రవీంద్రసంగీతం, 6-55 కార్యక్రమ వివరణ, 7.00 తె-వా, 7-15 ఎమ్. సీతారామానుజాచారి, 7-40 గాంధీకథ (విజయవాడ నుండి రిలే), 8-00 ఆం-వా, 8-15హిం-వా, 8-30 హిందూస్థానీ సంగీత శిక్షణ, 8-45 ప్రసారసమాప్తి.

మ॥ 11-40 మాధ్యమిక పాఠశాలలకు, (విజయవాడనుండిరిలే), 12-10 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ), 12-30 కార్మికులకార్యక్రమం (విజయవాడనుండి రిలే), 1-00 స్త్రీ సంసార్ (హిందీ), 1-30 హిందూస్థానీ వాద్య సంగీతం, 1-50 తె-వా, 2-00 వాద్య సంగీత్, 2-10 ఉ-వా, 2-20 హైదరాబాదు వి వలె, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక వార్కటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 ఉర్దూ కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గాంధీకథ(హిందీ), 7-30 కర్ణాటక సంగీత కచేరీ (మద్రాసు నుండి రిలే), 9-00 ఆం-వా, 9-15 ఉ.వా, 9-30 మాయర్ ఖేలా సంగీత నాటిక రచన: టాగూర్ (ఢిల్లీ నుండి రిలే), 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హయిద్రాబాదు-బి

49.02 మీ (6120 కిలో

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వలె, 8-45 ప్రసారసమాప్తి.

42.02 మీ [7140 కిలోసై]

మ॥ 11-40 హైద్రాబాద్ ఎ వలె, 12-10 క్లారినెట్: నిలయ విద్యాంసుడు, 12-30 హైద్రాబాదు ఎ వలె, 1-00 ఎం,సీతారామానుజాచారి,1-30 హైద్రాబాద్ ఎ వలె, 2-00 గాన మాధురి, 2-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 (499) కిలోసై

సా॥ 6-0 హైద్రాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె.వా 7-15 గ్రామస్థులకార్యక్రమము, 7-30 హైదరాబాదుఎవలె, 9-00 ఆం-వా, 9-15 లలిత సంగీత్, 9-30 హైద్రాబాద్ ఎ వలె, 10-30 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 సుభోదయం, 6-35 భక్తిరంజని (హైద్రాబాద్‌నుండిరిలే) 6-55 ప్రసార విశేషాలు, 7-00 తె-వా 7-15 హైద్రాబాద్‌వలె, 7-40 గాంధీ కథ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 11-30 లలిత సంగీతం, 11-40 మాధ్యమిక పాఠశాలలకు, 12-10 వయోజన: నిలయ విద్వాంసుడు, 12-30 కార్మికుల కార్యక్రమము, 1-00 శిష్ట ప్రభాకర కృష్ణమూర్తి శాస్త్రి, 1-30 బ్యాండువాద్యం, 1-50 తె-వా, 2-00 ప్రసార సమాప్తి

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 కర్ణాటక సంగీత కచేరీ (మద్రాసునుండిరిలే), 9-00 ఆం-వా, 9-15 త్యాగరాజ కృతి సమాన్నయము, 9-30 మాయర్ ఖేలా (టాగూర్) (ఢిల్లీ నుండి రిలే), 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

ప్రాతిపదిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సెమినార్

విజయపురి, జులై 5

స్థానిక నాగార్జున సాగరోన్నత పాఠశాలలో గతవారం రోజులనుండి జరుగుచున్న వరంగల్లు రీజియను ప్రాతిపదికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల సెమినారు యీ నెల 25 తేదీతో అంతమైనది. ఈ సందర్భమున జరిగిన సభకు హెడ్మాస్టరు శ్రీ సి. శివశంకరంగారు అధ్యక్షత వహించిరి. శ్రీ కె.వి.ఆర్. చౌదరి (ఎంప్లాయిమెంటు ఆఫీసరు), పి. సుబ్బసుందరం, టి.వి.జి.కె. శర్మ ఉపన్యసించిరి. వరంగల్లు వొకేషనల్ గైడెన్సు ఆఫీసరు శ్రీ ఉమాకాంతరావుగారు మూడు రోజులు ఉండి వృత్తి విద్యా ప్రాశస్త్యమును గూర్చి ఉపన్యసించిరి. శ్రీ పరుచూరి అంజనేయాచార్యులు గారు వందన సమర్పణ గావించిరి. నాటిరాత్రి సెమినారు సభ్యులకు శ్రీ యం. రంగస్వామి, సూపరింటెండింగు ఇంజనీరుగారు తమ యింటిలో గొప్ప విందుచేసిరి.

కొత్త శాస్త్ర పరికరాల తయారీ

భారత శాస్త్ర పరిశోధనాలయాలు సాధిస్తున్న ప్రగతి

న్యూఢిల్లీ, జులై 5

భారత పరిశోధనాలయాలలో శాస్త్ర పరిశోధనల ఫలితముగా రూపొందించబడిన ఏడు శాస్త్ర పరికరాల వర్ణనలు శాస్త్ర పారిశ్రామిక పరిశోధనా పత్రిక జూన్ సంచికలో వున్నాయి

వాటిలో మూడు పరికరాలు వాతావరణ పరిశోధనలకూ తత్సంబంధి రంగాల పరిశోధనలకు ఉపయోగిస్తాయి. అందులో ఒకటి లవణ రూపకము వర్షజలములో ఉప్పుపాలు ఎంతవుందో నిర్ణయించేందుకు యీ పరికరము ఉపకరిస్తుంది. ఆంధ్రా విశ్వవిద్యాలయములో భూభౌతిక విజ్ఞాన శాఖ యీ పరికరాన్ని తయారు చేసింది.

సముద్రవిజ్ఞానపరిశోధనలకుపనికివచ్చే ఒక కొత్త ఎలక్ట్రికల్ థెర్మామీటర్ కూడా కనిపెట్టబడింది దీనిని కూడా ఆంధ్రా విశ్వవిద్యాలయ భూభౌతిక విజ్ఞాన శాఖే రూపొందించింది. 0.03 డిగ్రీల ఫారిన్‌హీట్ వరకూ తాపక్రమ వ్యత్యాసాలను దాని ద్వారా తెలుసుకోవచ్చును.

హైదరాబాదు సైన్సు సొసైటీ కూడా రెండు కొత్త శాస్త్ర పరికరాలను కనిపెట్టింది. అందులో ఒకటి తుపాకీగుండు వేగాలను తెలుసుకునేందుకూ, మరొకటి సెకనులో లక్షవవంతు కాలాన్ని లెక్కించేందుకూ ఉపయోగిస్తాయి.

బెంగుళూరులోని భారత విజ్ఞాన శిక్షణ సంస్థ, బొంబాయిలోని అణుశక్తి సంస్థ కూడా రెండు కొత్త పరికరాలను రూపొందించాయి. కలకత్తాలోని భారత కేంద్ర జనపనార వ్యవహార సంఘానికి చెందిన సాంకేతిక పరిశోధనాలయాలు ఒక శాస్త్ర పరికరాన్ని రూపొందించాయి.

మైసూరు రాష్ట్రంలోని ద్విసభ్య నియోజకవర్గాలు

విభజనకు సూచనలు

న్యూఢిల్లీ, జులై 5

మైసూరు రాష్ట్రములోని శాసన సభ, పార్లమెంటరీ ద్విసభ్య నియోజకవర్గాల విభజన విషయములో ఎన్నికల సంఘము చేసిన ప్రతిపాదనలపై అభ్యంతరాలు, సూచనలు, 1961 ఏప్రిల్ 29వ తేదీవరకూ ఎన్నికల సంఘానికి అందిన వాటిని బెంగుళూరులోని విధాన సౌధంలో సమావేశ మందిరములో 1961 జులై 14వ తేదీ ఉదయము 10 గంటలనుంచే ఎన్నికల సంఘము బహిరంగ సమావేశములో పరిశీలించబడతాయని ఎన్నికలసంఘం నిన్న ఒక పత్రికా ప్రకటనలో తెలియజేసింది. ఆ సందర్భములో స్వయంగా తమ అభిప్రాయాలను ఎన్నికలసంఘానికి నివేదించదల్చిన వారు పైన పేర్కొన్న చోటుకు, పైన పేర్కొన్న తేదీన, వేళలలో స్వంతఖర్చులతో వచ్చి తమ అభిప్రాయాలను తెలియజేయ వచ్చును.

సమాచార పౌరసంబంధముల శాఖ గ్రంథాలయం

హైద్రాబాదు, జులై 5

హైద్రాబాదులోని సమాచార, పౌరసంబంధములశాఖ గ్రంథాలయానికి యీ క్రింద పేర్కొన్న ఇంగ్లీషు పుస్తకాలను కొత్తగా తెప్పించారు:- "సెల్యూలాస్‌రిసెర్చ్", "ఫౌండీ మౌల్డింగ్ సాండ్స్"లు కొత్తఢిల్లీలోని పారిశ్రామిక, శాస్త్ర విజ్ఞాన పరిశోధన మండలి ప్రచురణ "హిస్టరీ ఆఫ్ ఫ్రీడం మూమెంటు" (మొదటి సంపుటి)రచన -తారాచంద్ హిందూస్తాన్ ఇయర్ బుక్-1961"-"ల్యూర్ ఆఫ్ ఎవరెస్టు రచన: బ్రిగేడియర్ జ్ఞాన్ సింగ్; "టైమ్స్ ఆఫ్ ఇండియా డైరెక్టరీ అండ్ హూ ఈజ్ హూ, 1960-61"-"విట్ అండ్ విస్డమ్ ఆఫ్ టాగూర్" రచన: ఎన్. బి. సేన్.

కలెక్టర్ బదిలి సందర్భంలో విందు

(స్వ. వి)

గుంటూరు, జూలై 5

గుంటూరు జిల్లా కలెక్టరు శ్రీ జి. వి. యస్. మణిగారు హైదరాబాదునకు (ఫిషరీస్ డిపార్టుమెంటు డైరెక్టరుగా) బదిలిఅయి వెళ్లుచున్న సందర్భంలో వారి గౌరవార్థం ఆతిథేయసంఘంవారు విందును ఏర్పాటు గావించారు

శ్రీ కర్పూరపు రామకృష్ణమూర్తి సభాధ్యక్షత వహించారు. శ్రీయుతులు పి. మృత్యుంజయరావు, ఎం ప్రహ్లాద సుదర్శనం, వి. సుబ్బారావు, డాక్టర్ టి. ఎస్. పౌలస్ ప్రభృతులు, గుంటూరు జిల్లా కలెక్టరు గానేగాక, ప్రముఖసంఘ సేవకునిగా, శ్రీ జి. వి. ఎస్. మణిగారు చేసిన సేవా విశేషాలను ప్రస్తుతించారు

కలెక్టరుగారు తమ్ము గూర్చి పలికిన ప్రశంసా వాక్యాలకు, ఉచితరీతిని సమాధానమిచ్చారు.

వరంగల్‌లో టెలిఫోన్ కనెక్షన్లు

చాలినంతగా లభించడంలేదని ప్రకటన

(మా. వి.)

వరంగల్, జులై 5

రాజకీయముగా పారిశ్రామికంగా వ్యాపార కేంద్రముగా దినదినం అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరానికి కావలసినన్ని టెలిఫోన్లు లేకపోవటమువల్ల స్థానికవ్యాపారస్థులు ఇబ్బందులకు గురౌతున్నారని స్థానికులు వర్తకసంఘ సంయుక్త కార్యదర్శి శ్రీ కూచన రాజమౌళిగారు తెలిపారు వారి ప్రకటనలో ఇంకా ఇలా కలదు:

టెలిఫోన్లు కావాలని వందలమంది 1958 నుంచే టెలిఫోన్ శాఖకు దరఖాస్తులు పెట్టుకున్నారు. కాని ఆనాటి నుండి నేటివరకు ఏ ఒక్క దరఖాస్తుదారుకు టెలిఫోన్ సౌకర్యం ఆశాఖవారు కల్పించినట్లు కనబడదు.

వరంగల్ నగరం చారిత్రాత్మకంగానే కాకుండా అఖిలభారతముతో వర్తక వాణిజ్యాలలో సంబంధాలు కలిగి ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు పారిశ్రామిక ఎస్టేట్ లాంటి సంస్థలతో వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక రంగాలలోను, విద్యారంగంలోను అభివృద్ధి చెందుతున్నది. ఈనగరానికి ప్రజలకు అవసరమైన టెలిఫోన్ కనెక్షన్లను గత నాలుగు సంవత్సరాల నుండి సప్లయి చేయలేక పోయింది టెలిఫోన్ శాఖ.

హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాల తరువాత విజయవాడలో వున్నన్ని టెలిఫోన్లు ఆంధ్రప్రదేశ్‌లో మరేనగరానికి లేవు. విజయవాడలో ప్రస్తుతము 15 వందల టెలిఫోన్లు వున్నట్లు గత నాలుగు సంవత్సరాల నుండి సుమారు 800 టెలిఫోన్ కనెక్షన్లు కావాలని దరఖాస్తులు పెట్టుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతము వరంగల్ నగరములో సుమారు 193 టెలిఫోన్లు వున్నాయి. ఇందులో సగం టెలిఫోన్లు ప్రభుత్వ కార్యాలయాలకే వున్నాయి. (రాష్ట్రప్రభుత్వ కార్యాలయాలకు50, కేంద్రప్రభుత్వ కార్యాలయాలకు 20 కాగా మునిసిపాల్టీ 5, ఆజంజాహిమిల్లు 3, వ్యాపారస్తులకు 120) ఈ స్థితిలో టెలిఫోన్లు కావాలని దాదాపు 400 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యార్థికి రాజస్థాన్ స్కాలర్ షిప్పు

హైద్రాబాదు, జులై 5

జైపూర్‌లోని రాజస్థాన్ కళాశాలలో ఆర్ట్సులోగాని, సైన్సులోగాని మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు చదువదలచిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అర్హతగల విద్యార్థి లేక విద్యార్థినికి క్రిందటి సంవత్సరంలో వలెనే 1961-62 వ సంవత్సరంలో కూడా స్కాలర్‌షిప్ ఇవ్వడానికి రాజస్థాన్ ప్రభుత్వం తలపెట్టింది. ఈ స్కాలర్‌షిప్‌కొరకు అర్హతగల విద్యార్థి లేక విద్యార్థినినుంచి దరఖాస్తులు కోరబడుతున్నాయి. దరఖాస్తుదార్లు (1) 1961 ఏప్రిల్‌లో జరిగిన హయ్యర్ సెకండరీ, వి. యు. సి. లేదా వీటికి సమానమయిన మరేదయినా పరీక్షలో మొత్తంమీద నూటికి 60 మార్కులు పొంది ఉండవలెను. (2) క్రీడారంగంలో మంచి ప్రజ్ఞవున్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

స్కాలర్‌షిప్ పొందినవారికి (1) స్వస్థానం నుంచి జయిపూర్ వెళ్ళడానికీ, చాలారోజుల పాటు నెలవులు ఇచ్చినప్పుడు తనినివాసస్థానానికి వెళ్ళి తిరిగి జైపూర్ చేరడానికి సాధారణముగా మూడవ తరగతిలో ఒకరు ప్రయాణంచేయడానికి అయ్యే రైలు ఖర్చులూ (2) నెలకు రు. 100 ల చొప్పున పోషణఖర్చులు ఇస్తారు. (3) ట్యూషనుఫీజు ఉండదు. (4) వైద్య సదుపాయాలు ఉచితముగా లభింపజేయబడుతాయి.

దరఖాస్తులను హైద్రాబాదు, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టరుకు 1961 జులై 20వ తేదీనాటికి చాకలు చేయవలెను. దరఖాస్తు ఫారములను హైద్రాబాదు-20లోని విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంనుంచి పొంద వచ్చును.

ఆంధ్రాశ్రమం ప్రకటన

హృషికేశ్, జులై 5

గతనెల 6, 8, 13, 25 తారీఖులలో బదరీవెళ్ళే బస్సులు మూడు గంగలో పడిపోయినవి. మొత్తము 50 మంది వరకు పోయినారు. వీరిలో ఆంధ్రులు యెవ్వరూ లేరు. యిక్కడకు వచ్చిన వారందరు ఆంధ్రాశ్రమముకు క్షేమంగా చేరినారు. ఆంధ్రులు యెవ్వరు నష్టపోలేదు. యిదివరకు వెళ్ళినవారు అందరు సురక్షితంగా వచ్చినారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక స్థలముల నుండి ఉత్తరములు, టెలిగ్రామ్‌లు పంపించినారు. యెవ్వరు కంగారు పడనక్కరలేదని శ్రీసచ్చిదానంద సరస్వతి చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

నగర వార్తలు

మడ్‌ఫోర్టు జిల్లాపరిషత్తు పాఠశాలలో 9వ తరగతి

ప్రారంభం

మడ్‌ఫోర్టు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నూతనముగా తెలుగు 9వ తరగతి ప్రారంభింపబడినది. నగరములో యెందరో పాఠశాలలలో ప్రవేశములు లభించక యమయాతన పడుచుండుట అందరెరిగినదే. విద్యార్థులు మడ్‌ఫోర్టు పాఠశాలలో చేరదలచుకున్న ప్రధానోపాధ్యాయునితో సంప్రదించాలని ఒక పత్రికా ప్రకటన చేయబడింది. పాఠశాలలో బాలబాలికలకు ప్రవేశం కలదు.

ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం యొక్క కార్యనిర్వహణ సమితి సమావేశము యీ నెల 9వ తేదీ ఆదివారము మధ్యాహ్నము 2 గంటలకు హైద్రాబాదు గౌలిగూడ చమన్‌లోని బాలసరస్వతి ఆంధ్రభాషా నిలయమున జరుగును. దీనిలో యీ క్రింది విషయాలు పరిశీలించ బడతాయని తెలుస్తున్నది:

శాఖా సంఘముల నిర్మాణము, ఎన్నికలు లోకల్ లైబ్రరీ అధారిటీల నిర్మాణము, హైద్రాబాదులో సంఘ కేంద్ర కార్యాలయమునకు ప్రత్యేక స్థలమును సేకరించు విషయము, 31వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ. ఢిల్లీలో నెలాఖరులో జరుగనున్న అంతర్జాతీయ వయోజన విద్యామహాసభకు 1961 సెప్టెంబర్‌లో కోయంబుత్తూరులో జరుగనున్న జాతీయ వయోజన విద్యాగోష్ఠికి ప్రతినిధుల ఎన్నిక గ్రంథాలయ శిక్షణ పొందిన ఉద్యోగి నియామకం, యితర విషయములు.

ఈ సమావేశానికి ముందు ఆరోజు ఉదయం 9 గంటలకు అదే స్థలములో రాష్ట్ర సంస్థకు చెందిన జిల్లా శాఖల పునర్నిర్మాణం విషయమై సమాలోచనలు జరుపుటకు తెలంగాణా జిల్లా శాఖల కార్యదర్శుల సమావేశము జరుగుతుంది.

ప్రాణదుర్గ వాసపారాలు

మెసర్స్ కల్వ సూర్యనారాయణ

ఉస్మాన్‌గంజ కమిషన్ ఏజంటు
ఫోన్ నెం. 4412

హైద్రాబాద్, జులై 5
(క్వింటల్ ధరలు)

క్వింటల్ అంటే 100 కిలో గ్రాములు	
పాలకుర్కులు బియ్యం	57-50 62-00
గుజ్జులు "	62 00 64-00
నెం. 19 నెంబర్లు	57-00 62-00
దొడ్డు బియ్యం	55-00 57-50
గర్కులు	54-00 55-00
నానకరాంలు	61-00 63-00
బంగారుతీగెలు	64-00 66-50
గొట్టెబియ్యం	52-00 53.00
24 నెంబర్లు	64-00 66 50
ఎస్. కె. కె. బియ్యం	64-00 66-00
కొత్తసాంబర్లు	67-00 75-00
పాతసాంబర్లు	69-00 77-00
కుసుమబియ్యం	60-00 62-50
పచ్చజొన్నలు	82-00 84-00
చట్టిజొన్నలు	93-00 97-50
తెల్లజొన్నలు	38-00 40-50
పసుపు	122-00 125-0
కందులు పెద్దవి	42-00 44-00
కందులు చిన్నవి	37-00 39-00
మినుములు	55.00 58-50
సెనగలు	44.00 47-50
పెసలు	56-00 61.00
వులవలు	36-00 36-50
బెల్లం	24-00 44-00
మిరపకాయలు	70-00 135-00
చింతపండు	65-00 90-00
వుల్లిగడ్డ	18 00 22-00
యెల్లిగడ్డ	45-00 65-00
తెల్ల నువ్వులు	130-00 150-00
ఆముదాలు	68-00 69-50
ధనియాలు	84.00 90-00
కుసుమలు	52-00 56.00
యిలాతిపల్కు-పెద్దది	120-00 123-00
యిలాతిపల్కు-సం॥15	88-00 91-00
బన్‌సిగోధుమలు	56-00 62-00
శర్బతి గోధుమలు	46-00 53-00
పత్తిగింజలు	32-00 37-00
కందిపప్పు	53-00 59-00
కందిపప్పు చిన్నది	52-00 54-00
సెనగపప్పు	49-00 55-00
మినుపపప్పు	74-00 73-00
పెసరపప్పు	74-00 78-00
పల్కు-నూనె 10 కిలో	22-50 22-62
కల్నిపిండి	24-00 24-25
అనుములు	35-00 42-00

ఈ ప్రకారము యీరోజు అయిన ధరలు వ్రాయించినాము గిట్టిన సరుకులు పంపవచ్చును తెప్పించుకోవచ్చును.

బొగ్గుగనుల కార్మికుల సంక్షేమం

తీవ్రతర కృషి జరగాలని

శ్రీ నందా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జులై 5

కార్మిక సంక్షేమ పథకాలను విశాల దృష్టితో అమలు జరపాలని కేంద్ర కార్మిక, ప్లానింగు, ఉద్యోగ సాధక వ్యవహారాల మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా బొగ్గుగని కార్మికుల సంక్షేమ నిధి సలహా సంఘం సమావేశంలో విజ్ఞప్తిచేశారు.

బొగ్గుగని కార్మికులను అనేక తరాల నుంచి కొల్లగొట్టడం జరుగుతున్నదనీ, వారి సాంఘిక సంక్షేమానికి సమన్వయ పద్ధతిలో తీవ్రతర కృషి కొనసాగించవలసిన తరుణం వచ్చినదనీ, వారికి అక్కడొకటి అక్కడొకటి నివాసగృహాలు, చికిత్సా కేంద్రాలు నెలకొల్పితే సరిపోదనీ, వారి సాంఘిక ఆర్థిక స్థాయిలను పెంపొందించడానికి మనము పూర్తి బాధ్యత స్వీకరించాలనీ శ్రీ నందా చెప్పారు. కార్మికులు, యజమానులు, అధికారుల ప్రతినిధులుగలత్రైపాక్షిక సంఘం సమావేశంలో శ్రీ నందా మాట్లాడుతూ, ఇటీవలి సర్వేల ఫలితంగా బొగ్గుగని కార్మికులకు నిర్మించిన ఇళ్ళు ఘోర పరిస్థితులలోవున్నాయని తెలిసినదనీ, అందరికీ చాలినన్ని ఇళ్ళు లేక పోగా వున్నవికూడ పడిపోయే స్థితిలో వున్నాయనీ, వారికి ఇళ్ళు కట్టించడానికి ఒక సమగ్రపథకం బొగ్గుగనుల పారిశ్రామిక సంఘం మరు సమావేశంలో పరిశీలనకు రావాలనీ శ్రీ నందా అన్నారు. ఈ లోగా ప్రస్తుత ఇళ్ళను బాగుచేయాలనీ, వాసయోగ్యం కాని ఇళ్ళ స్థానంలో వేరే ఇళ్ళు కట్టాలని యీ పథకాలకు అత్యంతప్రాధాన్యం ఇవ్వాలని కూడా ఆయన కోరారు.

కార్మికులకు యూనిఫారములు, పాదరక్షలు యివ్వడంలో జరుగుతున్న ఆలస్యానికి ఆయన ఆందోళనచెంది, ఇందుకు సంబంధించిన అధికారులావాదేవీలన్నీ ఒక నెలలో పూర్తిశావాలనీ, యీ సంవత్సరం ఆఖరులోగా కార్మికులందరికీ వాటిని యివ్వాలనీ ఆయన చెప్పారు.

భారతీయ విద్యాభవన్ సంస్కృత పరీక్షలు

హైద్రాబాదు, జులై 5

భారతీయవిద్యాభవన్ బొంబాయి వారి సంస్కృత పరీక్షలలో కూర్చొడానికి దరఖాస్తుల పంపుటకు తుది తేదీ జులై 15.

సుల్తాన్ బజారులోని గవర్నమెంటు హైస్కూలులో అక్టోబర్ 7 8 తేదీలలో ఈ పరీక్షలు జరుగుతవి.

ప్రతిరోజు సాయంత్రం 6-30 నుండి ఈ పరీక్షలకై తరగతులు సుల్తాన్ బజారు గవర్నమెంట్ హైస్కూలులో చెప్పబడుతున్నవి.

రెండు ముఖాలు ఒక తల గల శిశువు!

జమ్ము, జులై 5

రెండు ముఖాలు ఒక తలలో ఇక్కడొక మధ్య వయస్కురాలగు స్త్రీకి శిశువు పుట్టింది.

ఈ పిల్లకు నాల్గు కాళ్ళు నాల్గు చేతులు కలవు.

కవల పిల్లలే ఈ విధంగా తల్లి కడుపులో కలసిపోయి ఉంటారని డాక్టర్లు భావిస్తున్నారు.

7 వ సంయుక్త వారం!

సిందూర్ ఫిల్మ్స్ సమర్పించు

ఎవరు దొంగ?

తా: బి సరోజాదేవి, ఉదయకుమార్, వీరప్ప, రాజగోపాల్.

సుభాష్- ముషీరాబాదు

నూర్ మహల్

(న్యూలైట్, సౌండ్‌తో)

అంబర్ పేట.

ఆటలు: 6-00, 9-30.

సెలెక్ట్- బొల్లారం

ఆటలు: 2-30, 6-00, 9 30.

రేపటి నుండి:

జగత్- సైదాబాదు

రామేశ్వరి- లాలగూడ

—ఉదయశ్రీ పిక్చర్స్ విడుదల.

4 వ సంయుక్త

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్-దక్కన్
రెవెన్యూబోర్డు (అబ్కారీ, మద్యపాన నిషేధం) శాఖ

సి. ఆర్. నెం. 27428/ఎక్స్/61/ఇ 3 తేది: 1-7-1961

ప్రకటన

దేశీపద్ధతిలో తయారుచేసిన ప్రభుత్వంవారి సారాయి రవాణాకు టెండర్లు

ప్రభుత్వ బట్టీలలో దేశీపద్ధతిలో తయారుచేసిన ప్రభుత్వమువారి సారాయిని 1961 అక్టోబర్ 1 వ తేదీతో ఆరంభమై 1962 సెప్టెంబరు 30 వ తేదీతో అంతమయ్యే అబ్కారీ సంవత్సరంలో యీ ప్రకటన అనుబంధంలో పేర్కొన్న అన్ని తెలంగాణా జిల్లాలలోని లైసెన్సులుగల సారా డిపోలకు చేరవేసి, అక్కడినుంచి లైసెన్సులున్న సారాదుకాణములకు పంపిణీ చేయడానికిగాను, జిల్లాలవారీగానూ, మండలాలవారీగాను టెండర్లు కావలెను.

టెండర్లను రెవెన్యూబోర్డు సంయుక్త కార్యదర్శి (అబ్కారీ, మద్యపాన నిషేధం)కి 1961 జూలై 17 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు స్వయంగాగానీ లేదా అధికారిక ప్రతినిధిద్వారాగాని దాఖలు చేయవలెను. సారాయిని డిపోలకు చేర్చడానికి, అక్కడినుంచి దుకాణములకు పంపిణీ చేయడానికి ఒక గ్యాలనుకు కనీసం యెంతకమిషను తీసుకునేదీ టెండర్లలో పేర్కొనాలి. టెండరు ఫారములను, ఎక్సైజు కమిషనరు కార్యాలయం అంటే రెవెన్యూబోర్డు ఎక్సైజు విభాగం (హైద్రాబాదు) నుంచి పొందవలెను. జిల్లాలోని ప్రతి మండలానికి వేరువేరుగా గాని లేదా ప్రతి జిల్లాకు వేరువేరుగా గాని టెండర్లు దాఖలుచేయవచ్చును.

టెండరు నిబంధనలు తదితర షరతులకు సంబంధించిన పూర్తి వివరాలను హైద్రాబాదు-దక్కన్‌లోని రెవెన్యూబోర్డు (అబ్కారీ, మద్యపాన నిషేధం) కార్యాలయం నుంచిగానీ లేదా జిల్లా అబ్కారి సూపరింటెండెంట్ల కార్యాలయం నుంచిగాని తెలుసుకొనవచ్చును.

(సం) అబ్కారీ, మద్యపాన నిషేధం,
రైత్వారి సెటిల్మెంట్స్, కమీషనర్ తరపున.

1961-62 (1371 ఫసలి) వ సంవత్సరానికి సారాయి సరఫరా కంట్రాక్టుల కొరకుగాను యేర్పరిచిన తెలంగాణాలోని మండలాలు, జిల్లాల జాబితా.

క్రమ సంఖ్య	జిల్లా పేరు	మండలం నెంబరు	మండలంలోని డిపోల పేర్లు
1.	2.	3.	4.
1.	నిజామాబాదు	1	ఆర్మూర్ బోధన్ నిజామాబాదు నవీపేట
		2	బాన్సువాడ బంజాపల్లి కామారెడ్డి ఎల్లారెడ్డి
2.	మెదక్	1	సంగారెడ్డి జోగిపేట జహీరాబాద్ నారాయణఖేడ్
		2	మెదక్ సిద్దిపేట
3.	మహబూబ్‌నగరం	1	అమన్‌గల్ జడేపల్లి షాద్‌నగర్ కల్వకుర్తి మహబూబ్‌నగర్ కొడంగల్
		2	మక్తల్ మర్కుల్ గద్వాల్ ఐజ్ అలంపురం
		3	అచ్చంపేట అమ్రాబాద్ పెంట్లవల్లి వనపర్తి నాగర్‌కర్నూల్
4.	హైద్రాబాదు (హైద్రాబాదు లోని దుకాణములు మినహా)	1	నికింద్రాబాదు బొలారం మేడ్చల్
		2	హయాత్‌నగర్ పర్గి తాండూర్ గండిపేట్ ఘట్కేసర్ వికారాబాదు
5.	వరంగల్	1	వరంగల్ వరదన్నపేట ఘనపురం మహబూబాబాద్ డోర్నకల్ తొర్రూర్ జనగామ చేర్యాల్
		2	నర్సంపేట ములుగు పరకాల
6.	ఖమ్మం	1	ఖమ్మం నేలకొండపల్లి సుల్తాన్‌పేట వైరా మధిర కల్లూరు వేంసూరు
		2	ఎల్లందు కొత్తగూడెం అశ్వరావుపేట బూర్గంపాడు కొండాయిగూడ
7.	నల్గొండ	1	నల్గొండ దేవరకొండ భువనగిరి
		2	హుజూర్‌నగర్ కోదాడు సూర్యాపేట మిర్యాలగూడెం పెద్దఊర
8.	కరీంనగర్	1	కరీంనగర్ హుజూరాబాద్ సిర్పిల్లా
		2	జగిత్యాల
9.	ఆదిలాబాద్	1	పెద్దపల్లి మంథని మహదేవ్‌పూర్ ఆదిలాబాద్ బోథ్ ఉట్నూర్
		2	భైన్సా నిర్మల్
		3	ఆసిఫాబాద్ చిన్నూర్ మంచిర్యాల నిర్మూర్

(సం) సహాయకార్యదర్శి,
రెవెన్యూబోర్డు, అబ్కారి, మద్యపాన నిషేధం.

గద్వాలలో ఆర్ట్సు సైన్సు కళాశాల

బి. ఎ., బి. ఎస్సి. తరగతుల ప్రారంభించుటకై అభ్యర్థన
(మా. వి)

గద్వాల, జులై 5

గత సంవత్సరము గద్వాలలో ఆరంభింపబడిన ఆర్ట్సు మరియు సైన్సు కళాశాలలో తొలి సంవత్సరపు పి. యు. సి తోబాటు యీ సంవత్సరము బి. ఎ; బి. యస్సి తరగతులు ఆరంభించుటకై కొన్నాళ్ళనుండి పైకళాశాల కమిటీ వారు అంగీకారం సాధించుటకై యూనివర్సిటీ అధికారులతో విధివిరామం లేకుండా కృషి చేస్తున్నారు.

దాని పర్యవసానముగా గద్వాల కళాశాలలో బి. ఎ; బి. యస్సి. తరగతులకు అఫిలియేషన్ యివ్వడానికై పరిశీలించుటకునాను యీ నెల రెండవ తేది గద్వాలకు ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ యం. అబ్దుల్ ఖాదర్ నాయకత్వములో శ్రీరావాడ సత్యనారాయణ, డా॥ పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, శ్రీ కె. యస్. ఆచార్య-విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గారలతో ఒక కమీషన్ వచ్చినది.

కళాశాల కమిటీ ప్రధాన అధ్యక్షులు శ్రీ కృష్ణరాంభూపాల్, కళాశాల ప్రధాన ప్రిన్సిపాల్ శ్రీ సూర్యనారాయణగారలు కమీషన్ సభ్యులకు పుష్పమాలలువేసి స్వాగత మిచ్చినారు.

కళాశాల ప్రిన్సిపాలు శ్రీ సూర్యనారాయణగారు తమ ప్రసంగములో కళాశాల కమిటీ వారు అన్ని విధములా కళాశాల నిర్వహణ విషయములో నిబ్బందికి సహకరించినారన్నారు. మొట్టమొదటి సంవత్సరం అయినా నూటికి 57 శాతం విద్యార్థులు పి యు. సి. గవర్నమెంటు పరీక్షలో ఉత్తీర్ణులయినారనీ, కళాశాల అధ్యాపక బృందం సంతృప్తిగా తనతో సహకరించిందన్నారు. ఈ సంవత్సరం బి. ఎ; బి. యస్సి. తరగతులలో చేరడానికని అప్పుడే దాదాపు 25 గురు విద్యార్థులు దరఖాస్తులు పెట్టినారని అఫిలియేషన్ కొరకు యింకా వాళ్ళను చేర్చుకొనకుండా వేచి వున్నామన్నారు.

కళాశాల కమిటీ అధ్యక్షులు శ్రీ రాజాకృష్ణరాంభూపాలుగారుమాట్లాడుతూ "ఒక మూల ప్రాంతమైన ఈ గద్వాలలో కళాశాలయేమిటి? వీరు నిర్వహించడమేమిటి? అది అయ్యేదికానే కాదు అని కొందరు అనేక విధాలుగా యెన్నెన్నో మమ్ములను గత సంవత్సరం యీ కాలేజి ఆరంభించిన తొలుతలో అన్నారన్నారు. అయినా మేము అనుకున్న దానిని ఆరంభించాము. ఒక్క సంవత్సరమే అయినా పి యు.సి. పబ్లిక్ పరీక్షల్లో నూటికి 57 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయినందుకు గర్వించాలి. ఈ యేడు బి.ఎ;బి.యస్సి. తరగతులు ఆరంభించాలని సంకల్పించుకున్నాము అని తెలిపారు.

ఈ తరగతులకు అనుమతిని అంగీకరించే విషయంలో కమీషన్ వారికి ఒక్క విషయం చెప్పాలనుకున్నాము. ఈ మా కాలేజి ప్రభుత్వ కాలేజి కాదు. మిషనరీల కాలేజి కాదు. కేవలం వ్యావసాయికుల సహకారముతో నడిచే కాలేజి. గవర్నమెంటు, మిషనరీల కాలేజీలయితే పుష్కలముగా ధనబలం వుండగలదు. మా కాలేజికి ప్రజల హార్దిక సంపూర్ణత వున్నది కాని వారు ఆర్థికంగా, గత సంవత్సరం పంటలు లేనందున కిటకిటలాడినారు. మా కళాశాలకు రావలసిన 1,20,000 రూపాయలు మైసూరు ప్రభుత్వంవద్ద వున్నది. కనుక మూలనిధి మావద్ద పుష్కలముగా లేదన్న సాకుతో కాక బి.ఎ.బి.యస్సి. తరగతులకు అఫిలియేషన్ గ్రాంటుచేయండి అని అభ్యర్థించుచున్నాము" అని అన్నారు.

గద్వాల శాసనసభ్యులు శ్రీ ధర్మపరం సత్యారెడ్డిగారు మాట్లాడినారు. గద్వాల, అలంపురం తాలూకాలలో కలిసికట్టుగా విరాళాల తీరిగి సేకరిస్తామని కమీషన్ వారికి హామీయిచ్చారు.

తర్వాత కాలేజి కమిటీ కార్యదర్శి శ్రీ పాగా పుల్లారెడ్డిగారు మాట్లాడారు.

శ్రీ పుల్లారెడ్డిగారు ఇంకా ఇలా తెలిపారు:-

ఖమ్మం కళాశాలలో తొలియేడు 80మంది విద్యార్థులు. ఇంకా కొన్ని కాలేజీలలో ఆరంభ సంవత్సరం 50మందికి మించలేదు. వాటినిచూచి మాకూ కొంత కొంతకు కలిగింది. కాని మొదటియేడే 80మంది విద్యార్థులు చేరారు. కొందరు మొదటి తరగతిలోకూడవుత్తీర్ణులైనారు. కాని యిక్కడ అర్థంచేసుకొనవలసినదొకటి వున్నది. మెట్రిక్యులేషన్‌వరకు అన్నీ తెనుగులో చదివి ఇంగ్లీషు మూడవ భాషగా చదివి ఒక్కసారిగా పి.యు.సి.లో అన్నీ ఇంగ్లీషులో చదువవలసి రావడం ఇంగ్లీషు ప్రధానభాషగా చదవవలసి రావడంతో విద్యార్థికి మొదట కొన్ని నెలలు వాతావరణాన్ని సరిచేసుకొనుటకే పట్టుతుంది. ఆయోమయపు కొత్తప్రపంచంలోకి వెళ్ళినట్లుగా అనుకుంటుంటాడు. ఇంకమరికొందరు మెట్రిక్‌వరకు చదివి, ప్యాసై, పైచదువుకు ఆర్థికశక్తిలేక విరమించుకొని యింటిపట్టున కొన్నేళ్ళు వుండి, విద్యావాతావరణానికి దూరమై మళ్ళీ గద్వాలలో కాలేజి కావడంతో అందుబాటై వచ్చి చేరినవాళ్ళు యిలాంటివారున్నారు. మా కాలేజిలోని విద్యార్థులందరూ చాలామటుకు యిక్కడ కాలేజి లేకుంటే స్థలాంతరం వెళ్ళిపైచదువులు చదవలేక ఆశలు వదలుకోవలసిన ఆర్థికిష్టమతల వాళ్ళే.

మా రాజాగారు కళాశాలకు భవనాలేకాక నగదుగా 25000రూపాయలిచ్చారు. కాలేజి సైన్సుఫర్నిచర్ వగైరాల కంపెనీల వారూ దాదాపు 40,000 రూపాయలదాక సామానులు అప్పుగాయిచ్చారు. మాకు ధైర్యం వచ్చింది. అడిగినచోటనల్లాసహకారం లభించింది. ఆరంభించాము.

కమీషన్ చైర్మన్ శ్రీ అబ్దుల్ ఖాదర్‌గారు సమాధానమిస్తూ కాలేజి నిర్వహణ, ఫలితాలూ, కాలేజీకమిటి సహకారోత్సాహాలకూ ప్రశంసిస్తున్నామంటూ అఫిలియేషన్ విషయంలో ఆర్థికస్థోమతను ప్రధానముగా చూడవలసి యున్నదనీ అయినా అందరి ఉత్సాహ వాంఛానాల ఆధారంగా అందరు కమీషన్ సభ్యులూ సానుభూతితో పరిశీలించినిర్ణయిస్తామన్నారు

కార్యదర్శి అభినందనాలతో సభ ముగిసింది.

ఆంధ్రలో అన్ని ప్రాజెక్టులు నిర్మించాలి

నెల్లూరు, జులై 5

అఖిలపక్ష ఐక్య కార్యాచరణ సమితివారి కృష్ణా, గోదావరి నదిజలాల సమస్యపై ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంలో 1-7-61 తేదినెల్లూరు జిల్లా కనిగిరి పట్టణములో బహిరంగ సభ ఏర్పాటు చేయబడినది. సభకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రతిపక్ష ఉపనాయకులు శ్రీ గుజ్జల యల్లమందా రెడ్డిగారు అధ్యక్షత వహించారు. సర్వశ్రీ తెన్నేటి విశ్వనాథంగారు, వావిలాల గోపాలకృష్ణయ్య, పైవి. కృష్ణారావు, మల్లెశ్రీరామమూర్తి, హరిశ్చంద్ర శతపతి, భవానిప్రసాద్, మాధవరావుగార్లు ఉపన్యసించారు.

అధ్యక్షోపన్యాసములో శ్రీ యల్లమందారెడ్డిగారు మాట్లాడుతూ 1951 ఒడంబడికను తిరగదోడడం వలన ఈ ప్రాంతానికి ప్రత్యేకించి తీరని అపచారం జరుగుతోందని, అందు వలన అందరూ సమైక్యమై ఆందోళన చేసి విజయం సాధించాలని చెప్పారు.

గుల్జారి కమిషన్ను నియమించి 1951 ఒడంబడికను తిరగదోడడం, దేశములో ఒక అనర్థదాయక సాంప్రదాయమునకు దారితీస్తుందని, అలాంటివి జరిగితే ఏ ఒడంబడికకూ విలువుండదని, రాష్ట్రాలకూ, రాష్ట్రాలకూ మధ్య నిరంతర తగాదాలకు దారితీస్తుందని, అందువలన 1951 ఒడంబడికను ఖచ్చితముగా అమలుజరుపాలని, గుల్జారి కమీషన్‌తో సంబంధము లేకుండా యిదివరకే నిర్ణయించిన ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని ప్రాజెక్టులూ నిర్మించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించడమయినది.

సభానంతరం శ్రీ కోసూరి పున్నయ్యభాగవతార్ గారిచే హరికథ చెప్పబడింది.

రాకపోకలు

మునిసిపల్ పరిపాలన, పశుపోషణ మత్స్యశాఖల మంత్రి శ్రీమందుముల నరసింగరావు జూలై 6వ తేదిమధ్యాహ్నం బయలుదేరి విజయవాడవెళ్ళి అమర్నాడు రాత్రి నగరానికి చేరుకుంటారు. ఆయన తిరిగి జూలై 9 వతేదీ రాత్రి బయలుదేరి కర్నూలు, శ్రీశైలంలకు వెళ్తారు. 12 వ తేదీ ఉదయం రాజధానికి తిరిగివస్తారు.

ఉపముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి ఈనెల 8 వతేదీన విమానంలో బయలుదేరి ఢిల్లీ వెళ్తారు. 11 వ తేదీన హైద్రాబాదుకు తిరిగి వస్తారు, ఆయన తిరిగి 13 వ తేదీ ఉదయము బయలుదేరి ఆదిలాబాదు, నిజామాబాదులకు వెళ్ళి అమర్నాడు సాయంత్రం నగరానికి వస్తారు.

నోటీసు

యీరోజున నేను శిరికొండ నరసింలు ద్వారా, శ్రీమతి బ్వారకాబాయి రేణుపూరకర్ గారి ప్లాటు నెం. 44 చిక్కడపల్లి సుమారు 350 (మూడు వందల యాభై) గజములు కొనుటకు అగ్రిమెంటు జేసినాను. యీ స్థలముమీద ఎవరికైనా యేదైనా అభ్యంతరము ఉన్నయెడల నాకు వారము రోజులలో తెలుప వలయును. అటు తరువాత యేఆక్షేపణకు బద్ధుడనుకాను.

ఇట్లు
వరగంటి నారాయణ
C/o ఎస్. కేసరి
ఇంజనీరింగ్ వర్క్‌షాప్
చార్‌మినార్ చౌరస్తా
హైద్రాబాద్ (ఆం. ప్ర.)

అజంతా సైకిళ్ళు
(మధ్య తరగతి ప్రభుత్యోద్యోగులకు)
వాయిదా పద్ధతులపై లభించుచున్నవి.
సంప్రదించండి:
బి. కిషన్‌లాల్ సైకిల్ ఇండస్ట్రీస్
కిరాయ పద్ధతిన అమ్మకపు ఏజన్సీ కార్యాలయం
ఉస్మాన్‌గంజ్ - హైద్రాబాద్ (ఆం. ప్ర)
A. A.

నేడే చూడండి! నేడే చూడండి!!
బాటతెలియనివారూ, బాటలు కలియనివారూ జీవయాత్రలో బాటసారులై ప్రేమించుకుంటే కలిగేఫలితం చూడండి.
భరణీవారి
బాటసారి
నిర్మాత, దర్శకుడు: పి. రామకృష్ణ
తా: భానుమతి, నాగేశ్వరరావు, జానకి.
కమల్ హైద్రాబాద్ రాజేశ్వర్ సికింద్రాబాద్
ఆటలు: 2-30, 6-00 మరియు 9-30.
శ్రీనివాస్ — వరంగల్.

— నవయుగ.

రేపు 2-30 నుండి గొప్ప విడుదల
గగుర్పాటు గల్గించు అత్యద్భుత దృశ్యములు చూచుటకు మంచి తరుణము!
కె. పి. ఆర్ట్ ప్రొడక్షన్స్
కన్న కొడుకు
(తెలుగు)

దర్శకత్వం: కృష్ణారావు
సంగీతం: కోదండపాణి
: తారాగణం :
* జగ్గయ్య
* దేవిక
* రామకృష్ణ
* కృష్ణకుమారి
* రమణారెడ్డి
* రాజనాల
* బాలకృష్ణ
* పేకేటి
దీపక్ మహల్ హైద్రాబాద్ మినర్వా సికింద్రాబాద్ లక్ష్మి వరంగల్
ఆటలు: 2-30, 6-00 మరియు 9-30. —పూర్ణా విడుదల. (Nima)

22 వ సంయుక్త వారము!
ప్రసాద్ ప్రొడక్షన్స్:
ససురాల్
రాయల్ - హైద్రాబాద్
ఆటలు: 3-00, 6-15, 9-30
ప్యారడైజ్ - సికింద్రాబాద్
ఆటలు: 6-15, 9-30.
10 వ వారం: రమేష్ - నిజామాబాద్
9 వ వారం: రీగల్ లాతూర్.
6 వవారం! చంద్రకాంత్ రాయ్‌చూర్. లక్ష్మి నాందేడ్.
3 వ వారం! సైదియా- బారంగాబాద్
—ప్రకాష్ పిక్చర్స్ విడుదల.
(Trupix)

చిట్ టెండరు నోటీసు
సవరణ
విషయము: హైదరాబాదు, బేగంపేట వద్ద కట్టబడు సెక్రటేరియట్ బిల్డింగు స్థలముచుట్టు ఆవరణ గోడకట్టి కట్టుటకు.
పై పనికి టెండరుఫారములు ది 11-7-1961 న తీసుకొనబడు తేదీ 25 రోజులవరకు పొడిగించబడినది. టెండరుఫారములు తీసుకొనబడు ఆఖరు తేది యందు ఈ క్రింద ఉదహరించిన మార్పులను గమనించగలరు.
(1) టెండరుఫారము తీసుకొనుటకు ఆఖరుతేది — 3-8-1961
(2) ఆఫీసు పనిచేయు వేళలయందు టెండరు ఫారములు మెడ్యూలురేట్లు స్పెసిఫికేషన్లతో సహా అమ్మబడుతేది. — 25-7-1961 నుంచి ది. 2-8-1961 వరకు
ఇతర వివరములు, షరతులు మొదటిసారి ప్రకటింపబడిన విధముగానే యుండును.
Sd. టి. వీర్నాధరాయి
సూపరింటెండింగు యింజనీరు,
పి. డబ్ల్యు. డి. హెడ్‌క్వార్టర్సు సర్కిల్, హైద్రాబాద్-(ద)

దయచేయండి
పోలెండ్ యొక్క టి. కులిసివిజ్ చే డ్రాయింగులలో
"ఇండియా & మెక్సికో"
ప్రదర్శనము
లలిత్ కళా అకాడమీ, న్యూఢిల్లీ వారి ఆధ్వర్యమున
హైద్రాబాద్ ఆర్ట్ సొసైటీ చే
అజంతా పావిలియన్ పబ్లిక్ గార్డెన్స్,
హైద్రాబాద్‌నందు నిర్వహించబడును.
1961 జులై 10 తేదీ వరకు
ప్రతిరోజు ఉ॥ 10-0 నుండి 12-0, సా॥ 4-0 నుండి 7-0 వరకు తెరచియుంచబడును.
ఉచిత ప్రవేశము.

మధ్యాహ్నం 12-30 లకు గొప్ప సంఘటన!
రేపే....



ఈ ఘోర హత్యకేసు విచారణ రేపే ప్రారంభం.
ఈ అసాధారణ న్యాయస్థాన గాథను తెలుసుకోడానికి మీరు హాజరు కాదలిస్తే అడ్వాన్సుగా సీటు మాత్రం బుక్ చేసుకోండి!
బి. ఆర్. ఫిలిమ్స్ వారి:
కానూన్

* అశోక్‌కుమార్ * రాజేంద్రకుమార్ * నందా
* జీవన్ * మహమూద్ * నానాపాల్సీకర్
నిర్మాత, దర్శకత్వం: బి. ఆర్. ఛోప్రా.
సంగీతం: సలీల్ చౌదరి.
జంటనగరములలో ఒకేసారి
బ్రహ్మాండమైన విడుదల
జమ్‌ఖండ్ (పూర్తి ఎయిర్ కండిషన్డు థియేటర్) హైద్రాబాద్
అజంతా సికింద్రాబాద్
రెండు థియేటర్లలో శుక్ర, శని, ఆదివారములలో
4 ఆటలు: 12-30, 3-30, 6-30, 9-30 గం॥
సోమవారము నుండి 3 ఆటలు: 3-30, 6-30, 9-30 గం॥
ఆటల వేళల్లో అడ్వాన్స్ బుకింగ్.
—మూవీస్ ప్రయివేట్ లిమిటెడ్ విడుదల.

Edited Printed and Published by N. Narotham Reddy M. A. for the Golkonda Publicatioo Lt at the Golkonda Printing Press, Hyderabad